మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 42 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnaga
Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yada



# మోడీ, కేసీఆర్ నాణానికి బొమ్మ, బొరుసు లాంటి వారు

## ఇద్దరు కలిసి తెలంగాణకు అన్యాయం చేశారు..

- మోడీ, కెసిఆర్ ఇద్దరూ తోడుదొంగలు
- తెలంగాణను ఢిల్లీలో తాకట్టు పెట్టిన కెసిఆర్
- రైతుల ఉసురు పోసుకున్న ప్రధాని మోదీ
- వరంగల్ పట్టణానికి ఔటర్ రింగ్ రోడ్డు
- అంతర్జాతీయ ఎయిర్ పోర్టును నిర్మిస్తాం
- కడియం కావ్యాను భారీ మెజార్టీతో గెలిపించాలి
- వరంగల్ సభలో సిఎం రేవంత్ రెడ్డి పిలుపు



హన్మకొండ, ఏప్రిల్ 24 (ప్రజా మంటలు): ప్రధాని మోదీ, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మోదీ, కేసీఆర్ తోడు దొంగలని విమర్శించారు. మేడిగడ్డ మేడిపండు అయ్యింది.. సుందిళ్ల సున్నం పెట్టిందని ఆరోపించారు. ప్రధాని మోదీపై హర్యానా రైతులు యుద్ధం ప్రకటించారని రేవంత్ గుర్తుచేశారు. కడియం శ్రీహరిని, కావ్యను కాంగ్రెస్ పార్టీలోకి తానే ఆహ్వానించానని రేవంత్ రెడ్డి సభాముఖంగా ప్రకటించారు. చదువుకున్న కడియం కావ్యను అభ్యర్థిగా ప్రకటించానని స్పష్టం చేశారు. హన్మకొండలో జరిగిన బహిరంగ సభలో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు.

మిగతా 2లో..

## దానం గెలుపు ఖాయం.. కేంద్రంలో మంత్రి కూడా ఖాయం



- కిషన్ రెడ్డి గెలిచినా చేసిందేమీ లేదు
- హైదరాబాద్‌కు వరదలొస్తే కానరాని మంత్రి
- సికింద్రాబాద్ ప్రచారంలో సిఎం రేవంత్

హైదరాబాద్, ఏప్రిల్ 24 (ప్రజా మంటలు): సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ గెలుపు ఖాయమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. దానం నాగేందర్ భారీ మెజార్టీతో గెలవబోతున్నారని తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థి మిగతా 2లో..

# కులగణన హామీపై బిజెపిలో భయం

- ఆర్థిక అసమానతలు గుర్తించడానికే సర్వే
- కాంగ్రెస్ ప్రభుత్వం తొలి సతకం దీనిపైనేనని వ్యాఖ్య
- ఢిల్లీలో జరిగిన సదస్సులె రాహుల్ స్పష్టీకరణ



న్యూఢిల్లీ, ఏప్రిల్ 24 (ప్రజా మంటలు): కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించిన 'సామాజిక-ఆర్థిక సర్వే' హామీపై ఆ పార్టీ సీనియర్ నేత రాహుల్ గాంధీ స్పష్టత ఇచ్చారు. దేశంలో ఎంతమందికి అన్యాయం జరిగిందనేది తెలుసు కునేందుకే సర్వే చేస్తామని తాము చెబుతున్నామని అన్నారు. సర్వే అనంతరం చర్యలు తీసుకుంటామని తాము చెప్పలేదన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో 'సంపద సర్వే' హామీ రాజకీయంగా దుమారం రేపుతోంది. ప్రజల సంపద, నగల్ని దోచుకుని అందరికీ పునఃపంపిణీ మిగతా 2లో..




## తెలంగాణ ఇంటర్ ఫలితాలు వెల్లడి

**ఫస్టియర్‌లో 60.01 శాతం, సెకండియర్‌లో 64.19 శాతం ఉత్తీర్ణత**

**మళ్లీ బాలికలదే పైచేయి**

హైదరాబాద్, ఏప్రిల్ 24 (ప్రజా మంటలు): తెలంగాణలో ఇంటర్మీడియట్ పరీక్షల ఫలి తాలు వెల్లడయ్యాయి. బుధవారం ఉదయం 11 గంటలకు నాంపల్లిలోని ఇంట ర్మీడియట్ బోర్డు కార్యాలయంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, బోర్డు కార్యదర్శి శృతి ఓజా ఇంటర్ ఫలితాలను వెల్లడించారు. ఇంటర్మీడియట్ ఫస్ట్, సెకండ్ ఇయర్స్‌కు సంబంధించిన ఫలితాలను ఒకేసారి విడుదల చేశారు.ఫస్టియర్‌లో 60.01 శాతం, సెకండి యర్‌లో 64.19 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

మిగతా 2లో..

### ఇండియా కూటమి ప్రధాని అభ్యర్థి ఎవరో

## ఏడాదికొకరిని నియమించే యోచన

**మధ్యప్రదేశ్ ప్రచారంలో మోడీ ఎద్దేవా**



భోపాల్, ఏప్రిల్ 24 (ప్రజా మంటలు): 'ఇండియా' కూటమి తరపున ప్రధానమంత్రి అభ్యర్థి ఎవరనేది తేలకపోవడంతో ఏడాదికి ఒకరిని ప్రధాన మంత్రి చేసే ఆలోచనలో ప్రస్తుతం విపక్ష కూటమి ఉన్నట్టు తెలుస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎద్దేవా చేశారు. మధ్యప్రదేశ్ లోని బేతుల్‌లో బుధవారంనాడు ఎన్నికల ర్యాలీలో ప్రధాని మాట్లాడారు. ప్రధాని కుర్చీలో ఏడాదికో ప్రధానిని నిలపాలనే ఆలోచనలో ఇండియా కూటమి ఉన్నట్టు కథనాలు వస్తున్నాయన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత 100 రోజుల్లో చేయాల్సిన పనులపై తాను కసరత్తు చేస్తుంటే, విపక్ష కూటమికి ప్రధాని అభ్యర్థిని కూడా ప్రకటించ లేకపోయిందన్నారు.ఇండియా' కూటమి ప్రధానమంత్రి అభ్యర్థి ఎవరనేది దేశానికి తెలియాలి. మావైపు నుంచి పదేళ్ల ట్రాక్ రికార్డుతో మోదీ మీ

# అసమర్థుల చేతుల్లో రాష్ట్రం ఆగం


- కరెంట్, నీళ్లు ఇవ్వలేని దుస్థితి
- బిఆర్ఎస్ హయాంలో కరెంట్ కష్టాలు లేవు
- మిగులు విద్యుత్ ఉండేలా చేసిన ఘనత మాది
- రైతుబంధులో దగా.. రైతుబీమా ఉంటుందో.. ఊడుతుందో
- బిఆర్ఎస్‌ను మళ్లీ గెలిపిస్తేనే కొట్లాడగలుగుతాం
- మిర్యాలగూడ సభలో బిఆర్ఎస్ అధినేన కెసిఆర్

నల్లగొండ, ఏప్రిల్ 24 (ప్రజా మంటలు): తెలంగాణలో అసమర్థులు రాజ్యాన్ని ఏలుతున్నారని బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ మండిపడ్డారు. అడ్డగోలు హామీలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. రైతుబంధు అడిగితే చెప్పుతో కొడతామని ఓ మంత్రి అంటున్నారని.. రైతుల చెప్పులు ఇంకా గట్టిగా ఉంటాయని తాను మంత్రికి చెప్పనన్నారు. బీఆర్ఎస్ హయాంలో 24 గంటలు వచ్చిన కరెంట్ ఇప్పుడు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో మిగులు విద్యుత్ ఉండేలా చేశామన్నారు. కాంగ్రెస్ హయాంలో రైతుబంధులో దగా.. రైతుబీమా ఉంటుందో.. ఊడుతుందో తెలియదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులు గెలిస్తే ప్రభుత్వం మెడలు వచ్చి 420 హామీలను

మిగతా 2లో..



## ప్రజా నాడి





## సుప్రీం దెబ్బతో దిగివచ్చిన పతంజలి

**క్షమాపణలు కోరుతూ భారీ ప్రకటనలు**

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): పతంజలి ప్రకటనల వివాదంలో సుప్రీం ఆదేశాలతో దిగివచ్చింది. భారీ ప్రకటనను ఇచ్చి క్షమాపణలు కోరింది. ఎన్నిసార్లు మందలించినా తీరు మార్చుకోవడం లేదంటూ సుప్రీంకోర్టు ఇప్పటికే అక్షింతలు వేసింది. ఆ తరవాత రామ్‌దేవ్ బాబాతో పాటు

మిగతా 3లో..



### కోటక్ మహీంద్రాపై

## ఆర్‌బిఐ కొరడా




- ఆన్‌లైన్‌లో కొత్త కస్టమర్ల చేరికపై నిషేధం
- కొత్తగా క్రెడిట్ కార్డుల జారీపైనా ఆంక్షలు

ముంబై, ఏప్రిల్ 24 (ప్రజా మంటలు): రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మరో సంచలన నిర్ణయం తీసుకున్నది. ప్రముఖ ప్రైవేట్ బ్యాంక్ అయిన కొటాక్ మహీంద్రా బ్యాంక్ ఆన్ లైన్ సేవలపై ఆంక్షలు విధించింది. ఈ మేరకు బుధవారం ఆర్బీఐ ఆదేశాలు జారీ చేసింది. కొటాక్ మహీంద్రా బ్యాంక్ ఆన్ లైన్ సేవలకు సంబంధించి.. కొత్తగా ఎలాంటి క్రెడిట్ కార్డులు జారీ చేయటానికి వీల్లేదు. మొబైల్ బ్యాంకింగ్ సేవల కింద.. కొత్త కస్టమర్లను ఆన్ బోర్డ్ చేయకూడదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశించింది. కొటాక్ మహీంద్రా బ్యాంక్ గత రెండు సంవత్సరాలుగా.. అంటే 2022, 2023 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి.. ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ గవర్నరెన్స్, ఐటీ రిస్క్ కేటగిరీల్లో లోపాలు మిగతా 2లో..



## బంగారం ధరలకు స్వల్పంగా బ్రేక్

**అతర్జాతీయ ప్రభావంతో దిగివచ్చిన రేట్లు**

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): బంగారం కొనుగోలుదారులకు కొంత ఊరట దక్కింది. ఇన్నాళ్లూ భారీగా పెరిగిన బంగారం ధరకు కాస్త బ్రేక్ పడింది. అంతర్జాతీయంగా గిరాకీ తగ్గడంతో పసిడి ధర దిగి వచ్చింది. అంతర్జాతీయ విపణిలో బంగారం ధర క్షీణించడంతో దేశీయంగా వెయ్యి రూపాయలకు పైనే తగ్గింది. మంగళవారం

మిగతా 2లో..

# అధిష్టానం అలిగిరెడ్డి వైపే అనుచరుల ఆశాభావం



**నామినేషన్ దాఖలు చేసిన అనుచర గణం**
**కాంగ్రెస్ నుండి వెలిచాల, అలిగిరెడ్డి ఇద్దరూ నామినేషన్ దాఖలు**
**చివరి క్షణం వరకూ ఉత్కంఠ**
**ఎటు తేల్చుకోలేని స్థితిలో అధిష్టానం**
**అయోమయంలో కాంగ్రెస్ శ్రేణులు..**







భీమదేవరపల్లి ప్రతినిధి కాశిరెడ్డి ఆదిరెడ్డి
ఏప్రిల్ 21 (ప్రజామంటలు) : హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి అనుచరుల నిర్ణయంతో ఒక్కసారిగా కాంగ్రెస్ పార్లమెంట్ కాంగ్రెస్ కార్యకర్తలు ఆసక్తి నెలకొంది. తమ పార్లమెంట్ అభ్యర్థి ఎవరో అర్థం కాక అయోమయంలో ఉన్నారు. కాంగ్రెస్ అధిష్టానం టికెట్ ఎవరికీ కేటాయించకపోవడంతో పోటాపోటీగా కాంగ్రెస్ తరపున వెలిచాల రాజేందర్రావు, అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి ఇద్దరు నామినేషన్ దాఖలు చేశారు.

**త్యాగానికి ఫలితం ఉంటుందా.....?**

అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి పార్టీలో చేసిన సేవలకు, త్యాగాలకు విలువలు ఉంటాయా అనే సందేహం నెలకొంది. అసెంబ్లీ ఎలక్షన్లకు ముందు హుస్నాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా చెల్లాచెదురులైన పార్టీని ఏకం చేయడంలో సఫలీకృతులయ్యాడు. పొన్నం ప్రభాకర్ పేరు తెర పైకి రావడంతో అధిష్టానం ఆదేశాల మేరకు పొన్నం ప్రభాకర్ కు సీటు త్యాగం చేసి గెలుపులో ప్రధాన భూమిక పోషించారు. రాత్రింబవళ్లు తిరిగి కష్టపడి పొన్నం ప్రభాకర్ గెలుపులో కీలక పాత్ర పోషించారు. అల్గిరెడ్డి కృషికి, పొన్నం గెలుపు కోసం పడ్డ ఆరాటాన్ని చూసి అప్పట్లో రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుర్తింపు ఇస్తామ ని నమ్మబలికారు.

**వెలిచాల రాజేంద్ర రావు నామినేషన్ తో విస్మయం**

చివరి క్షణం వరకు తనకే టికెట్ ఇస్తామని నమ్మిబలికి తెర పైకి వెలిచాల రాజేందర్ రావును తీసుకు వచ్చారు. మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో కరీంనగర్ పార్లమెంటు పరిధిలోని ఎమ్మెల్యేలంతా హాజరై వెలిచాలతో నామినేషన్ వేయించడం కార్యకర్తల అయోమయానికి కారణమైంది.

**మంత్రి పొన్నం మాట తప్పినట్లేనా?**

ఢిల్లీలో మకాం వేసి అధి ష్టానం పెద్దలతో మంతనాలు సీఎం, మంత్రి పొన్నం కూడా తనకే టికెట్ ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. తీరా వెలిచాల నామినేషన్ వేయడంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పొమ్మని పొగపెట్టినట్లు అలిగిరెడ్డి అనుచరులు భావిస్తున్నారు. ఈ క్షణం వరకూ మౌఖికంగా ఎవరికి టికెట్ అధికారికంగా ప్రకటించలేదు.

**పార్టీ మారే ఆలోచన గిట్టని వారి ప్రచారమే**

అయితే అల్గిరెడ్డిలో చాలా ఆలోచనలో పడ్డట్లు, తర్జన భర్జన అవుతున్నట్లు బీజేపీలోకి పోతే ఎలా ఉంటుంది. మరో పార్టీలోకి పోతే ఉంటుంది. అనే ఆలోచ నలో పడ్డట్లు వస్తున్న వార్తల్లో ఏమాత్రం నిజం లేదని, ప్రవీణ్ రెడ్డి అంటే గిట్టని వారు పార్టీ మారుతున్నారని అపోహలు సృష్టిస్తున్నారని స్పష్టం అవుతుంది.

**అధిష్టానంపై అనుచరుల అసహనం**

మరో వైపు ప్రవీణ్ రెడ్డి వర్గీయులు మాత్రం కాంగ్రెస్ అధినాయకత్వంపై సీరియస్ ఉన్నారు. మరో కోణం చూస్తే హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గి రెడ్డి ప్రవీణ్ రెడ్డి, గత అసెంబ్లీ ఎన్నికలలో తన పదవిని త్యాగం చేసి పొన్నం ప్రభాకర్ ను గెలిపించడంలో ప్రధాన పాత్ర పోషించారు. అప్పట్లో అల్గిరెడ్డిని రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ఇద్దరు ఒప్పించి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ టికెట్ ఇచ్చి గెలిపించు కుంటామని ఓ రాజకీయ ఒప్పందం ఉంది. ఆ ఒప్పందం మేరకు తనకేటికెట్ ఇవ్వాలని అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి పట్టు పట్టాడు. ప్రవీణ్ రెడ్డి కి రాజకీయ పరిచయాలు, వ్యక్తిగత సంబంధాలు మెండుగా ఉన్నా యి. దాంతో పాటు రెడ్డి సామాజిక ఓటు బ్యాంక్ ఉంది. ఈ బలంతో తనకు టికెట్ ఇస్తే గెలిచే సత్తా ఉన్నప్పటికిని అధిష్టానం ఇప్పటికీ నిర్ణయం తీసుకోకపోవడంతో కార్యకర్తలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

## బంగారం ధరలకు స్వల్పంగా బ్రేక్

రాత్రి 8 గంటల సమయానికి బులియన్ మార్కెట్లో 10 గ్రాముల స్వచ్ఛమైన పసిడి (24 క్యారెట్లు) ధర రూ.74,300గా (పన్నులు కలుపుకొని) ఉంది. వెండి కిలో ధర సైతం రూ.2 వేల వరకు తగ్గింది. 83,300 వద్ద కొనసాగుతోంది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధర ఔన్సు 2322 డాలర్లుగా ఉంది. ఒక్కరోజు లోనే దాదాపు 50 డాలర్లకు పైగా తగ్గింది. పశ్చిమాసియాలో ఇరాన్- ఇజ్రాయెల్ మధ్య ఘర్షణలు ఇటీవల పసిడి ధరలకు రెక్కలు రావడానికి కారణమయ్యాయి. దీంతో సురక్షిత పెట్టుబడి సాధనంగా భావించి బంగారంవైపు మదుపరులు దృష్టి సారించారు. ప్రస్తుతం ఘర్షణలు తగ్గుముఖం పట్టడం, అమెరికా ఫెడరల్ రిజర్వ్ మరికొంత కాలం పాటు అధిక వడ్డీ రేట్లను కొనసాగించే అవకాశాలు కనిపిస్తుండడంతో పసిడికి గిరాకీ తగ్గింది. రిస్క్‌తో కూడిన పెట్టుబడిన సాధనాల వైపు మదుపరులు పెట్టుబడులు మళ్లిస్తుండడం, గరిష్ఠాల వద్ద లాభాల స్వీకరణకు ట్రేడర్లు మొగ్గు చూపడంతో బంగారం ధర తగ్గడానికి కారణమని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీలో సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ పేర్కొన్నారు.

## తెలంగాణ ఇంటర్ ఫలితాలు వెల్లడి

**ఫస్టియర్‌లో 60.01 శాతం, సెకండియర్‌లో 64.19 శాతం ఉత్తీర్ణత - మళ్లీ బాలికలదే పైచేయి**



ఫస్టియర్ పరీక్షలకు మొత్తం 4.78 లక్షల విద్యార్థులు హాజరుకాగా.. 2.87 లక్షల మంది ఉత్తీర్ణులయ్యారు. సెకండియర్ పరీక్షలకు మొత్తం 5.02 లక్షల మంది హాజరవగా.. 3.22 లక్షల మంది పాసయ్యారు. ఎప్పటిలాగే ఈసారి కూడా బాలుర కంటే బాలికలదే పైచేయిగా ఉంది. బాలికల కేటగిరీలో ఫస్టియర్‌లో 68.35 శాతం మంది ఉత్తీర్ణత సాధించగా.. బాలుర కేటగిరీలో కేవలం 51.5 శాతం మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. సెకండియర్ బాలికల కేటగిరీలో 72.53 శాతం మంది ఉత్తీర్ణులు కాగా.. బాలుర కేటగిరీలో 56.1 శాతం మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. ఇక జిల్లాల వారీగా చూసుకుంటే ఇంటర్ ఫస్టియర్ ఫలితాల్లో రంగారెడ్డి జిల్లా 71.7 శాతం ఉత్తీర్ణతతో ప్రథమ స్థానంలో ఉండగా.. మేడ్చల్ జిల్లా 71.58 శాత ఉత్తీర్ణతతో ద్వితీయ స్థానంలో, ములుగు జిల్లా 70.01 శాతం ఉత్తీర్ణతతో తృతీయ స్థానంలో నిలిచాయి. అదేవిధంగా సెకండ్ ఇయర్ ఫలితాల్లో 82.95 శాతం ఉత్తీర్ణతతో ములుగు జిల్లాకు ప్రథమ స్థానం, 79.31 శాతం ఉత్తీర్ణతతో మేడ్చల్ జిల్లాకు ద్వితీయ స్థానం, 77.63 శాతం ఉత్తీర్ణతతో రంగారెడ్డి జిల్లాకు తృతీయ స్థానం దక్కాయి.

# అసమర్థుల చేతుల్లో రాష్ట్రం ఆగం

అమలు చేయించేలా పోరాటం చేస్తామన్నారు. జైళ్లకు భయపడే వ్యక్తి తాను కాదన్నారు కేసీఆర్. తాను జైళ్లకు బయపడితే తెలంగాణ వచ్చేదా అని ప్రశ్నించారు. నల్గొండ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డికి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు నిప్పులు చెరిగాయి. బస్‌యాత్రలో భాగంగా బుధవారం సాయంత్రం మిర్యాలగూడలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఈ రోజు పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మళ్లీ మీ దర్శనానికి రావడం జరిగింది. ఏం జరుగుతుంది ఈ రాష్ట్రంలో. నాలుగైదు నెలల కిందట ధీమాగా ఉన్న రైతు ఈ రోజు దిగాలుపడి చాలా బాధలో ఉన్నాడు. ఆ నాడు నేను నీళ్ల కోసం, నిధుల కోసం, కరెంటు కోసం, మన ప్రజల కోసం ఉద్యమిస్తే.. 15 సంవత్సరాల పోరాటం తర్వాత బ్రహ్మాండంగా మనం తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నాం' అన్నారు. ఆ నాటి నుంచి ఈనాటి వరకు మన పోరాటం నీళ్లు. తెలంగాణ బతుకే నీళ్లపై పోరాటం. ఈ జిల్లాల్లో మంత్రులున్నారు. ఇరిగేషన్ మినిస్టర్ స్వయంగా ఇక్కడ ఉన్నడు. వీళ్లు దద్దమ్మల్లా పోయి నాగార్జునసాగర్ కట్టపై కేంద్రానికి, కేఆర్ఎంబీకి అప్పగించారు. మీరంతా కళ్లారా చూశారు. మీ అందరినీ నేను ఒకటే కోరుతున్నా. 1956 నుంచి ఈ నాటి వరకు మనకు శత్రువే కాంగ్రెస్ పార్టీ. 56వ సంవత్సరంలో ఏపీలో కలిపి 58 సంవత్సరాలు అనేక రకాలుగా గోసపెట్టిందే కాంగ్రెస్ పార్టీ. మొన్న ఎన్నికల్లో అడ్డగోలు హామీలు ఇచ్చింది. నోటికి మొక్కాలి అన్ని హామీలు ఇచ్చారు. 420 హామీలు ఇచ్చి.. సక్కగా ఉన్న తెలంగాణలో ఉడుముల్లా సొచ్చి మనకు అవస్థలు తెచ్చిపెడుతున్నారు. రైతుబంధు కావాలని రైతులు అడిగితే చెప్పుతోని కొడుతా అని ఒక మంత్రి మాట్లాడుతున్నడు. చెప్పులు మీకే లేవు రైతులకు కూడా ఉంటయ్, వాళ్ల చెప్పులు చాలా బందబస్తుగా ఉంటయ్ అని నేను చెప్పిన' అంటూ గుర్తు చేశారు కేసీఆర్. బీఆర్ఎస్ పాలనలో తెలంగాణలో 18 పంటలకు ఏమాత్రం వెనుకాముందు కాకుండా బ్రహ్మాండంగా సాగర్ ఆయకట్టంతా నీళ్లిచ్చి బంగారు పంటలు పండించాం. ఇవాళ ఈ రోజు ఏమైంది? సాగర్‌లో నీళ్లు ఉండే.. ఇవ్వగలిగే అవకాశం ఉండే. ఈ దద్దమ్మలకు దమ్ములేక.. ప్రాజెక్టును తీసుకుపోయి కేఆర్ఎంబీ చేతులో పెట్టి పంటలన్నీ ఎండబెట్టారు. తెలంగాణ వచ్చిన తర్వాత పంటలు ఎండినయంటే ఇదే మొదటిసారి. రైతుబంధులో ధగా.. రైతుబీమా ఉంటదో ఊడుతదో తెలియదు. బ్రహ్మాండంగా కేసీఆర్ ఉన్నన్ని రోజులు రెప్పపాటు పోని కరెంటు కటుక బంద్‌చేసినట్లే మాయమైంది. ఎక్కడికి పోయింది కరెంటు ? ఏమైంది కరెంటుకు ? వీళ్లు కొత్తగా గడ్డపారలు పట్టి తవ్వి పని చేయాల్సిన అవసరం లేకున్నా కేసీఆర్ తొమ్మిదేళ్లు ఇచ్చిన కరెంటును కూడా నడిపించలేని అసమర్థులు రాజ్యమేలుతున్నరు. కరెంటు ఎందుకు ఆగమవుతుంది' అంటూ రేవంత్ సర్కారును కేసీఆర్ ప్రశ్నించారు.ప్రజలను ఎందుకు బాధలుపెడుతున్నరు? మిగులు కరెంటు ఉండే పద్ధతిలో మేం చేశాం. ఆ మాత్రం మీకు చేయచేతనైతలేదా? సరఫరా జరిగిన కరెంటును అలాగే ఇవ్వచ్చు కదా? ఎందుకు ఇవ్వలేకపోతున్నారు ? మిషన్ భగీరథతో మంచినీళ్లు తెచ్చి అర్బన్ ఏరియాలో.. మున్సిపల్ ఏరియాలో అన్నివర్గాల పేదలకు దొరకాలని ఒక్కరూపాయికే నల్లా కనెక్షన్ ఇచ్చాం. ప్రతి ఇంట్లో నల్లా బిగించి ప్రతి ఇంటికీ నల్లా నీరందించాం. ఇవాళ మిషన్ భగీరథ ఎందుకు నడుపలేకపోతున్నరు. మీ తెలివితక్కువ తనం ఏందీ? దయచేసి ప్రజలు ఆలోచించాలి. ఆ నాడు నీళ్లకోసమే గోస. నాలుగైదు నెలలకే.. కేసీఆర్ పక్కకు జరుగంగనే ఎందుకు మాయమై పోయినయ్ ? ఎందుకు బాధపడుతున్నరు ? సమాధానం చెప్పాలి' అని డిమాండ్ చేశారు. ఈ జిల్లాలో ఉన్న మంత్రులు కేసీఆర్‌ను తిట్టడం ఒకటే పని. కేసీఆర్‌ను తిట్టాలి పబ్బం గడుపుకోవాలి తప్పా.. పంటలు ఎండబెట్టారు.. రైతుబంధు ఎగొట్టారు.. రైతుబంధు ఐదెకరాలు అని మాట్లాడుతున్నారు. ఏం పోయింది మీ అబ్బసొత్తా ? ఇచ్చేందుకు మీకు ఏం బాధైంది. ప్రభుత్వం సహాయం లేకుండా ప్రపంచంలో ఎక్కడా రైతులు వ్యవసాయం చేయడం లేదు. దాన్ని గమనించే భారతదేశంలో తొలిసారిగా రైతులకు అండగా ఉండాలని, అప్పులు తీరాలని బ్జడెట్ నుంచి రూ.15వేలు-రూ.16వేలకోట్లు పెట్టి రైతుబంధు ఇచ్చాం. నేను వస్తుంటే ఆర్జాలబావి దగ్గర బస్సును రైతులు ఆపారు. సార్ 20 రోజులైంది ధాన్యం తెచ్చి ధాన్యం కొనడం లేదని చెప్పారు. ఎందుకు వస్తుంది ఈ పరిస్థితి ? బీఆర్ఎస్ గవర్నమెంట్ ఉన్నప్పుడు ఇదే నరేంద్ర మోదీ వడ్లు కొన అని మొండి కేస్తే.. ముఖ్యమంత్రితో సహా తెలంగాణ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఢిల్లీలో ధర్నా చేసి.. నరేంద్ర మోదీ మెడలు వంచి.. మా తెలంగాణ పండిస్తున్నది. న్యాయంగా కొనాలి అని చెప్పి కొనుగోలు చేసేలా చేశాం. మద్దతు ధర రూపాయి తగ్గకుండా ధాన్యం కొనుగోలు చేసి రైతుల అకౌంట్లలో వేశాం' అన్నారు.



**మొదటి పేజీ తరువాయి**

## కులగణన హామీపై బిజెపిలో భయం

చేస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టో చెబుతోందంటూ ప్రధానమంత్రి మోదీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ నేత శామ్ పిట్రోడా చేసిన వ్యాఖ్యలు కూడా మోదీ విమర్శలకు దగ్గరగా ఉన్నాయనే అభిప్రాయానికి తావిచ్చింది. అమెరికాలో వారసత్వ పన్ను ఉందని, ఆ ప్రకారం ఒక వ్యక్తి మరణం తర్వాత ఆయన సంపదనలో సుమారు 45 శాతం మాత్రమే వారసులకు వెళ్తుందని, తక్కిన 55 శాతం ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని, ఇది తనకు న్యాయంగానే అనిపిస్తోందని పిట్రోడా వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో 'సంపద సర్వే' హామీపై కాంగ్రెస్ వివరణ ఇచ్చింది. ఢిల్లీలో జరిగిన పార్టీ సామాజిక న్యాయ సమ్మేళన్ కార్యక్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ, సామాజిక-ఆర్థిక సర్వేతో కూడిన కులగణనకు ఎందుకు బీజేపీ వారు భయపడుతున్నారని ప్రశ్నించారు. సర్వేతో అసలు సమస్య ఎంటో, ఎక్కడుందో తెలుస్తుందని అన్నారు. తాము అధికారంలోకి రాగానే తొలి నిర్ణయం దీనిపైనే ఉంటుందన్నారు. సమాజంలో అన్యాయానికి గురవుతున్న 90 శాతం మందికి న్యాయం కల్పించడమే తమ ఉద్దేశమన్నారు. దేశంలో ఎంతమందికి అన్యాయం జరిగిందనేది తెలుసుకునేందుక సామాజిక-ఆర్థిక సర్వేతో కూడిన కులగణన ఉద్దేశమని చెప్పారు. దేశభక్తులమని చెప్పుకునే వారికి సామాజిక-ఆర్థిక సర్వేతో కూడిన కులగణన గురించి భయమెందుకని ప్రశ్నించారు. 70 ఏళ్ల తర్వాత చేపట్టనున్న కీలకమైన సర్వే ఇదని అన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టో చూసి ప్రధానిలో ఆందోళన మొదలైందని చెప్పారు. 90 శాతం భారతీయులకు అన్యాయం జరిగిందని, దీన్ని సరిచేయాలని తాను చెప్పినప్పటి నుంచి ప్రధాని, బీజేపీ తనపై దాడి మొదలుపెట్టినట్టు చెప్పారు. కచ్చితంగా తమది (కాంగ్రెస్) రివల్యూషనరీ మేనిఫెస్టో అని రాహుల్ స్పష్టం చేశారు.

## మోడీ, కేసీఆర్ నాణానికి బొమ్మ, బొరుసు లాంటి వారు




తెలంగాణకు రెండో రాజధానిగా వరంగల్ కు అన్ని అర్హతలు ఉన్నాయన్నారు. వరంగల్ పట్టణానికి ఔటర్ రింగ్ రోడ్డుతోపాటు అంతర్జాతీయ ఎయిర్ పోర్టును నిర్మిస్తామని హామీనిచ్చారు. హైదరాబాద్ తోపాటు వరంగల్ ను అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తామన్నారు. మడికొండలో నిర్వహించిన కాంగ్రెస్ జనజాతర సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. కడియం శ్రీహరి దగ్గర కోట్ల రూపాయలు చూసి ఎంపీ టికెట్ ఇవ్వలేదు.. ఆయన నిజాయితీని చూసి ఇచ్చామన్నారు. మీ బిడ్డ కడియం కావ్యను ఆశీర్వదించి.. భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ సర్కార్ కృషి చేస్తోందన్నారు. వరంగల్ పట్టణాన్ని సుందరంగా అభివృద్ధి చేస్తాం. వరంగల్ పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను నిర్మిస్తాం. కాకతీయ యూనివర్సిటీని ప్రక్షాళన చేస్తాం. యూనివర్సిటీకి త్వరలోనే కొత్త వైస్ చాన్సలర్ ను నియమిస్తాం. వరంగల్ ఇండస్ట్రియల్ కారిడార్ ను తీసుకొచ్చి యువతకు ఉపాధి కల్పిస్తాం. కల్వకుంట్ల ఫ్యామిలీ నుంచి తెలంగాణకు విముక్తి కల్పించాలని అన్నారు. కేసీఆర్ చర్చకు అసెంబ్లీకి రమ్మంటే.. పారిపోతుండు. దమ్ముంటే కేసీఆర్ కాళేశ్వరంపై చర్చకు రావాలి. మేం కట్టిన ప్రాజెక్టులు ఎలా ఉన్నాయో.. కాళేశ్వరం ఎలా ఉందో చర్చిద్దాం అన్నారు. మామా అల్లుళ్లు తోక తెగిన బల్లుల్లా ఎగిసిపడుతున్నారు. మోడీ, కేసీఆర్ నాణానికి బొమ్మ, బొరుసు లాంటి వారని రేవంత్ విమర్శించారు. ఇద్దరు కలిసి తెలంగాణకు అన్యాయం చేశారు. కేసీఆర్ రాష్ట్రాన్ని ఢిల్లీలో తాకట్టుపెట్టారు. మోదీ ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్నాడు.. పదేళ్లలో 20 కోట్ల ఉద్యోగాలు ఎక్కడని ప్రశ్నించారు. మోదీ యువతతోపాటు రైతులను మోసం చేశాడు. నల్ల చట్టాలు తెచ్చి రైతులను ఇబ్బంది పెట్టాలని చూశాడు. దేశ సరిహద్దులో రైతులు పోరాటం చేసి మోదీ మెడలు వంచారు. రైతుల ఆదాయం పెంచుతామని చెప్పి.. రైతులు పండించిన ధాన్యాన్ని కొనలేదు కాజీపేటకు సోనియా కోచ్ ఫ్యాక్టరీ ఇస్తే.. మోదీ మహారాష్ట్రకు తరలించుకుపోయాడు. మోదీ దేన్నీ వదలలేదు.. అన్నింటిపై పన్నులు వేశారు. బీజేపీ వాళ్లకు మత పిచ్చి పట్టుకుంది. అభివృద్ధిపై మాట్లాడకుండా బీజేపీ వాళ్లు.. మత చిచ్చు పెట్టి మూడోసారి గెలవాలని చూస్తున్నారు. వరంగల్ లో రెండు ఎంపీ సీట్లు కాంగ్రెస్ గెలవాలని, అందుకు మీరంతా సిద్ధమా అని అడిగారు.

## దానం గెలుపు ఖాయం.. కేంద్రంలో మంత్రి కూడా ఖాయం

దానం నాగేందర్ నామినేషన్ ర్యాలీలో పాల్గొన్న రేవంత్... సికింద్రాబాద్ లో ఏ పార్టీ గెలిస్తే కేంద్రంలో అదే పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సికింద్రాబాద్ లో దానం నాగేందర్ గెలిస్తే కేంద్రంలో కీలక పదవి ఇప్పించే భాధ్యత తనదేనన్నారు. సికింద్రాబాద్ నుంచి ఎంపీగా గెలిచిన కిషన్ రెడ్డి రాష్ట్రానికి ఏం చేశారని ప్రశ్నించారు. జంట నగరాలు వరదల్లో మునిగితే కిషన్ రెడ్డి ఎక్కడికిపోయారని అన్నారు. కేంద్రం నుంచి కిషన్ రెడ్డి పైసా వరద సాయం తేలేదన్నారు. సికింద్రాబాద్ ఎంపీ స్థానంలో కాంగ్రెస్ పార్టీ గెలవ బోతోందని.. కేంద్రంలోనూ తమ ప్రభుత్వమే రాబోతుందని సీఎం రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సికింద్రాబాద్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భారాస అభ్యర్థి పద్మారావు మంచోడే కానీ.. కేసీఆర్‌ను నమ్ముకుంటే ఆయన మునిగినట్టే. పరువు తీయడానికే అతడిని సికింద్రాబాద్ అభ్యర్థిగా నిలబెట్టారు. పద్మారావు నామినేషన్‌కు కేటీఆర్, కేసీఆర్ ఎందుకు రాలేదన్నారు. ఆయనకు వాళ్లు మద్దతు ఇవ్వడంలేదు. సికింద్రాబాద్ టికెట్‌ను భాజపాకు తాకట్టు పెట్టారని ఆరోపించారు. హైదరాబాద్‌ను అభివృద్ధి చేసిన ఘనత కాంగ్రెస్‌దే. మత సామరస్యాన్ని కాపాడింది మా పార్టీ. భారాసకు ఓటేస్తే మూసీ కాలువలో వేసినట్లే. దేవుడు గుడిలో ఉండాలి.. భక్తి గుండెల్లో ఉండాలి. దేవుడిని ప్రధాని మోదీ బజారులోకి తీసుకొచ్చారు. మత చిచ్చుపెట్టి ఎన్నికల్లో నెగ్గాలని భాజపా చూస్తోందని రేవంత్‌రెడ్డి విమర్శించారు. గ్రేటర్ సిటీకి మెట్రో, కృష్ణా గోదావరి నీటిని తెచ్చిన ఘనత కాంగ్రెస్ దేనన్నారు సీఎం రేవంత్ రెడ్డి. కేసీఆర్ సికింద్రాబాద్ టికెట్ ను బీజేపీకి తాకట్టు పెట్టారని ఆరోపించారు. కేసీఆర్ పద్మారావును ఓడించి కవితకు బెయిల్ తెచ్చుకుంటారని విమర్శించారు. పద్మారావు నామినేషన్ కు కేసీఆర్, కేటీఆర్ ఎందుక రాలేదో చెప్పాలన్నారు. బీఆర్ఎస్ కు ఓటేస్తే బీజేపీకి లాభం జరుగుతుందన్నారు. బస్తీలు బాగుపడాలంటే కాంగ్రెస్ కు ఓటెయ్యాలని చెప్పారు. సికింద్రాబాద్ లో బీఆర్ఎస్ కు ఓటేస్తే మూసీ మురికి వాడలో వేసినట్లేనని విమర్శించారు. నిరుద్యోగులను ,రైతులను ప్రధాని మోసం చేశారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఏటా 20 లక్షల జాబ్ లు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఓటమి భయంతో మోదీ మతాల మధ్య చిచ్చు పెడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ హయాంలో మతసామరస్యం వెల్లివిరిసిందన్నారు. హైదరాబాద్ అభివృద్ధి చెందాలంటే మతసామరస్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. సికింద్రబాద్ లో దానం నాగేందర్ ను లక్ష మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో అంజన్ కుమార్ యాదవ్, నాగేందర్, అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత ఆన్లైన్ కోచింగ్ ప్రారంభించిన కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ మహమ్మద్ ముస్తఫా




**జగిత్యాల ఏప్రిల్ 24 (ప్రజామంటలు):** ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల జగిత్యాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల లక్ష్మెట్టిపేట, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కరీంనగర్, ఎస్ ఆర్ ఆర్ ప్రభుత్వ కళాశాల కరీంనగర్, ఆర్ బి వి ఆర్ ఆర్ మహిళ డిగ్రీ కళాశాల అటానమస్ హైదరాబాద్, డిగ్రీ కళాశాలల అసోసియేషన్ నిర్వహిస్తున్న ఉచిత ఆన్లైన్ కోచింగ్ ను కాకతీయ విశ్వవిద్యాలయ వృక్షశాస్త్ర విభాగ బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్పర్సన్ డాక్టర్ మహమ్మద్ ముస్తఫా ఈరోజు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి జనరల్ సెక్రెటరీ టిజిసిటిఏ విచ్చేసి ఆన్లైన్ కోచింగ్ నిర్వహిస్తున్న కన్వీనర్ డాక్టర్ పడాల తిరుపతి మరియు రివర్స్ పర్సన్ ల ను అభినందించారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై సత్యనారాయణ మాట్లాడుతూ.... గత మూడు సంవత్సరాలుగా ఉచిత ఆన్లైన్ కోచింగ్ ద్వారా వెనుకబడిన ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఆన్లైన్ కోచింగ్ ద్వారా విజ్ఞానాన్ని సమపాధించి వివిధ విశ్వవిద్యాలయంలో సీట్ సాధించారని సందర్భంగా కన్వీనర్ డాక్టర్ పడాల తిరుపతి మరియు రిసార్ట్స్ పర్సన్ ను అభినందించారు. డాక్టర్ జై కిషన్ ఓజ ప్రభుత్వా డిగ్రీ అండ్ పీజీ కళాశాల లక్ష్మెట్టిపేట మాట్లాడుతూ గత సంవత్సరపు ఫలితాలను గమనిస్తే ఆన్లైన్ కోచింగ్ ద్వారా తెలంగాణ రాష్ట్రంలోని అనుభవం గడించిన అధ్యాపకులు ఇందులో పాల్గొని విద్యార్థులకు లబ్ధి చేకూర్చాలని ఇ సంవత్సరం కూడా అలాగే మంచి ఫలితాలు సాధించాలని విద్యార్థులకి వృక్ష శాస్త్రం పట్ల అభిలాష పెంపొందించాలని పేర్కొన్నారు. డాక్టర్ జె అచ్చిత దేవి ప్రిన్సిపల్ ఆర్ బి వి ఆర్ ఆర్ మహిళా కళాశాల హైదరాబాద్ వారు మాట్లాడుతూ.... రాజ బహదూర్ వెంకటరామిరెడ్డి కళాశాల ఎల్లప్పుడు కూడా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలతో సహాయ సహకారాలు అందిస్తూ ఫ్యాకల్టీ ఎక్స్చేంజ్ ప్రోగ్రామ్, స్టూడెంట్ ఎక్స్చేంజ్ ప్రోగ్రాం మరియు ఎంవోయూల ద్వారా విద్యార్థులకు అధ్యాపకులకు అకాడమిక్ మరియు రీసెర్చ్ వస్తున్న నూతన అంశాలను చర్చించుకోవచ్చు అని పేర్కొన్నారు. ప్రొఫెసర్ మహమ్మద్ ముస్తఫా కీలక ఉపన్యాసం చేస్తూ ప్రతి సంవత్సరం ఎందరో విద్యార్థులు డిగ్రీని పూర్తి చేసి పీజీ ముఖ్యంగా వృక్ష శాస్త్రం పట్ల మక్కువ పెంచుకునేటట్లు చేస్తున్న ఈ కోచింగ్ నిర్వహిస్తున్న డాక్టర్ పడాల తిరుపతి మరియు రిసోర్స్ పర్సన్ లను అభినందిస్తూ ఇది ఇదేవిధంగా కొనసాగాలని తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని విద్యార్థులకి విద్య మరియు పరిశోధన పట్ల అభిలాష పెంపొందించాలని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఆర్ బి వి ఆర్ ఆర్ ఉమెన్స్ కళాశాల శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ రజిని, డాక్టర్ ఏ కవితా, డాక్టర్ పి మంజుల, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల జగిత్యాల వృక్ష శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జి చంద్రయ్య, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ మసులూరు సుల్తానా, డాక్టర్ కే కిరణ్ మై, జి డి సి లక్షెట్టిపేట్ వృక్ష శాస్త్ర విభాగాధిపతి శ్రీమతి పి సవిత, టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ అధ్యాపకులు ఓడేటి వినయ్ కుమార్, కుమారి జాడి ఇందు, కుమారి అపూర్వ, తదితర అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇద్దరు మంత్రులకు సవాల్ గా రెండు సీట్లు

## భువనగిరి,నల్లగొండల్లో గెలుపు అనివార్యం - గట్టిగా కృషి చేస్తున్న ఉత్తమ్, కోమటిరెడ్డి

**నల్లగొండ,ఏప్రిల్24 (ప్రజా మంటలు):** నల్గొండ, భువనగిరి పార్లమెంట్ స్థానాలు కాంగ్రెస్ అగ్ర నేతలకు సవాల్ గా మారాయి. ముఖ్యంగా ఇద్దరు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలకు ఈ రెండు సీట్లు సవాల్ లాంటివే. గెలవడంతో పాటు, మెజార్టీ సాధిస్తేనే వీరికి గౌరవం దక్కుతుంది. ఇక్కడ పార్టీల మధ్య జరుగుతున్న పోటీ కంటే నల్గొండ వర్సెస్ భువనగిరి మధ్య జరుగుతున్న పోటీగానే కాంగ్రెస్ భావిస్తోంది. ఇద్దరు జిల్లా మంత్రులు, ఇన్ చార్జి ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి దేశంలోనే అత్యధిక మెజార్టీ సాధిస్తామని శపథం చేయడం ఆసక్తికరంగా మారింది. రెండుచోట్ల భారీ మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి ఉమ్మడి నల్గొండ జిల్లాకు ప్రత్యేకమైన గుర్తింపు తెస్తామని మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, భువనగిరి ఇన్చార్జి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రెండుచోట్ల బీఆర్ఎస్, బీజేపీ పోటీనే కాదని, నల్గొండ కాంగ్రెస్, భువనగిరి కాంగ్రెస్ మధ్య జరుగుతున్న యుద్ధమని రాజగోపాల్రెడ్డి వ్యాఖ్యలు చేశారు. నాలుగు లక్షల మెజార్టీ సాధిస్తామని అంటున్నారు. ఈ ఎన్నికల్లో రెండు పార్టీలకు డిపాజిట్లు దక్కకుండా జిల్లా అగ్రనేతలు పక్కా వ్యూహంతో ముందుకు సాగుతున్నారు. పార్టీ సభ్యత్వ నమోదులో నల్గొండ ఎంపీ సెగ్మెంట్ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. అదే స్పీడ్తో మెజార్టీ కూడా సాధించి తీరుతామని మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి పనిచేస్తున్నారు. దివంగత ఎంపీ రావి నారాయణరెడ్డికి వచ్చిన రికార్డు మెజార్టీని బ్రేక్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. నల్గొండ, భువనగిరి ఎంపీ సెగ్మెంట్ల పరిధిలోని 14 నియోజకవర్గాల్లో 12 చోట్ల కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ఉన్నారు. వీరంతా అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజార్టీ సాధించారు. దీంతో ఎంపీ ఎన్నికల్లో నాలుగు లక్షల మెజార్టీ వస్తదనే ధీమాతో ఉన్నారు. 1952లో సార్వత్రిక ఎన్నికల్లో రావి నారాయణరెడ్డికి 2,72,280 మెజార్టీ వచ్చింది. ఈయన భువనగిరి నుంచి ఎంపీగా ప్రాతినిధ్యం వహించారు. ఈ ఎన్నికల్లో దేశంలో నెహ్రూకు వచ్చిన మెజార్టీ కంటే రావి నారాయణకు వచ్చిన మెజార్టే ఎక్కువ. ఆ తర్వాత మళ్లీ 2009లో నల్గొండ ఎంపీ సెగ్మెంట్లో గుత్తా సుఖేందర్?రెడ్డికి 1,52,982 ఓట్ల మెజార్టీ రాగా, 2014 లో 1,93,156 ఓట్ల మెజార్టీ వచ్చింది. రెండు ఎంపీ సీట్లను కాంగ్రెస్ సీనియర్లు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. రెండుచోట్ల సీఎం రేవంత్ రెడ్డి సన్నిహితులు కావడం ఒక ఎత్తయితే, సీఎంతో జిల్లా నేతలకు ఉన్న విభేదాలు కూడా ఈ ఎన్నికల్లో తుడిచిపెట్టుకు పోయాయి. అందరూ ఐక్యంగా కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుపైనే దృష్టి పెట్టారు. నల్గొండకు మించి భువనగిరి అభ్యర్థి 3 లక్షల మెజార్టీ సాధిస్తే యాదాద్రి టెంపుల్ పేరును మళ్లీ యాదిరిగుట్టగా మారుస్తానని, మూసీ ప్రక్షాళన చేస్తామని, గంధమల్ల, బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టులు పూర్తిచేస్తామని సీఎం రేవంత్ ఇటీవలే హామీ ఇచ్చారు. అంతేకాకుండా నల్గొండలో ఫ్లోరైడ్ మహమ్మారిని నిర్మూలించేందుకు శ్రీశైలం సొరంగ మార్గం పనులు వీలైనంత త్వరగా పూర్తి చేస్తామన్నారు. ఈ క్రమంలో విపక్ష బిఆర్ఎస్కు సవాళ్లు విసరుతూ ప్రచారం సాగిస్తున్నారు. బిఆర్ఎస్ ఖాళీ అవుతుందని అంటున్నారు.



**హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో పాల్గొన్న విప్ లక్ష్మణ్ కుమార్**

**గొల్లపల్లి ఏప్రిల్ 14 (ప్రజామంటలు):** గొల్లపెల్లి మండలం భీమ్రాజ్ పల్లె గ్రామంలో నిర్వహించిన శ్రీ హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరీ లక్ష్మణ్ కుమార్. అనంతరం ఇస్రాజ్ పల్లె



గ్రామంలోని శ్రీ త్రికూట ఆలయాన్ని దర్శించుకొని గణపతి, శివలింగ, గాయత్రి మాత, దత్తాత్రేయ స్వామి, అభయాంజనేయ స్వామి, జంట నాగుల విగ్రహాల ప్రతిష్టాపన మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి, సీనియర్ నాయకులు చంద్రశేఖర రావు, మాజీ సర్పంచులు గ్రామ ప్రజలు, మహిళలు, యువకులు ఆలయ కమిటీ సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి

## ఉపాధి హామీ పనుల వేతనాలు విడుదల - ఎంపీడీవో వీరేశం

**భీమదేవరపల్లి ఏప్రిల్ 24 (ప్రజామంటలు):** మండలంలోని రసూల్ పల్లి, మల్లారం, వీర్లగడ్డ తండాలలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో వీరేశం, ఏపీవో కుమారస్వామి తో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ%ౌ%. ప్రతి ఒక్కరు ఉపాధి హామీ పనులను క్రమం తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. గత కొంతకాలంగా వేతనాల కోసం ఎదురుచూస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీల వేతనాలు, నర్సరీల మెయింటనెన్స్ బకాయిలు ఏప్రిల్ వరకు మంజూరైనట్లు తెలిపారు. ప్రతి గ్రామపంచాయతీలో కూలీల సంఖ్యను పెంచాలని పంచాయతీ సెక్రటరీలు, ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. వేసవి తీవ్రత దృష్ట్యా గ్రామాలలోని నర్సరీలలో మొక్కల పెంపకం నకు సంబంధించి పలు సూచనలు చేశారు. నీటి కొరత లేకుండా పెంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.



# సుప్రీం దెబ్బతో దిగివచ్చిన పతంజలి

ఆచార్య బాలకృష్ణ స్పందించారు. కోర్టుకు క్షమాపణలు చెప్పారు. అయితే...పేపర్లలో పతంజలి ప్రకటనలు ఏ సైజ్లో అయితే వేస్తారో అదే సైజ్లో క్షమాపణలు చెబుతూ ప్రకటనలు వేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ మేరకు ఇప్పటికే ఓ రోజు యాడ్స్ వేసిన పతంజలి వరుసగా రెండోరోజూ ప్రకటన ఇచ్చింది. తప్పుదోవ పట్టించే ప్రకటనలు చేసినందుకు అందరినీ క్షమాపణలు కోరుతున్నట్టు అందులో పేర్కొంది. 'ఇప్పటి వరకూ మా ప్రకటనల్లో వచ్చిన తప్పులకు క్షమాపణలు కోరుతున్నాను. ఇలాంటి పొరపాటు మళ్లీ జరగకుండా జాగ్రత్తపడతాం. ఇకపై నిబద్ధతగా ఉంటాం అని పతంజలి ప్రకటించారు. సుప్రీంకోర్టు దెబ్బకి దిగొచ్చిన పతంజలి, క్షమాపణలు కోరుతూ న్యూస్పేపర్లలో భారీ ప్రకటనలు చేసింది. అంతకు ముందు సుప్రీంకోర్టు పతంజలిపై దాఖలైన పిటిషన్పై విచారణ జరిపింది. పతంజలి ఉత్పత్తులపై న్యూస్ పేపర్లలో భారీ ఎత్తున ప్రకటనలు ఇస్తున్న విషయాన్ని ప్రస్తావించింది. క్షమాపణలు కూడా అదే స్థాయిలో చెప్పాలని స్పష్టం చేసింది. జస్టిస్ హిమా కోహ్లీ, జస్టిస్ అహ్సనుద్దీన్ అమానుల్లాతో కూడిన ధర్మాసనానికి రామ్దేవ్ బాబా వివరణ ఇచ్చారు. దాదాపు 67 వార్తాపత్రికల్లో క్షమాపణలు కోరుతూ ప్రకటనలు ఇచ్చినట్టు వెల్లడించారు. వీటి కోసం తమ సంస్థ రూ.10 లక్షలు ఖర్చు చేసినట్టు తెలిపారు. అయితే...క్షమాపణలు చెప్పిన తీరునీ తప్పుబట్టింది కోర్టు. 'మీరు ఇచ్చిన ప్రకటనల సైజ్ని మార్చి మాకు చూపించకండి. వాటిని ఏ సైజ్లో ప్రింట్ చేయించారో చెప్పండి. ఇంత చిన్నగా ఉంటే మైక్రోస్కోప్లు పెట్టుకుని చూడాలా..? కేవలం పేపర్మీద కనిపిస్తే చాలదు. అందరికీ కనిపించాలని ఆదేశించింది.

# కోటక్ మహీంద్రాపై ఆర్బిఐ కొరడా

ఉన్నట్లు ఆర్బీఐ గుర్తించింది. వరసగా రెండేళ్లపాటు ఈ లోపాలు బయటపడటంతో ఆంక్షలు విధించింది. ఈ క్రమంలో ఆన్లైన్ ద్వారా కస్టమర్లను తీసుకోవటం, ఆన్లైన్ ద్వారా క్రెడిట్ కార్డులను జారీ చేయటాన్ని నిలిపివేసింది. ఏప్రిల్ 23వ తేదీ వరకు ఉన్న కస్టమర్లకు ఎలాంటి ఇబ్బంది ఉండదని.. యథావిధిగా లావాదేవీలు కొనసాగించవచ్చని.. వారి సేవలకు మామూలు గానే కొనసాగుతాయని స్పష్టం చేసింది. కొత్త ఖాతాదారులను చేర్చుకోవటంపైనే ఆంక్షలు ఉన్నాయని.. ఇప్పటి వరకు ఉన్న ఖాతాదారులకు సంబంధించిన సేవలు యధావిధిగా కొనసాగుతాయని స్పష్టం చేసింది.

## ఇండియా కూటమి ప్రధాని అభ్యర్థి ఎవరో

# ఏడాదికొకరిని నియమించే యోచన

## మధ్యప్రదేశ్ ప్రచారంలో మోడీ ఎద్దేవా



ముందే ఉన్నారు. విపక్షాలు పీఎం ఫేస్ కోసం వెతికి ఒక్కరినీ ఎంచుకోలేకపోయాయి. ఏడాదికో ఒకరిని ప్రధానిని చేసే ఆలోచన జరుగు తోందని మీడియాలో ఇప్పుడు కథనాలు వస్తున్నాయి. అంటే ఐదేళ్లలో ఐదుగురుప్రధానులు అవుతారు. అప్పుడు దేశానికి ఏం జరుగుతుంది?' అని మోదీ ప్రశ్నించారు. 'ఇండియా' కూటమి పీఎం ఫార్ములాపై మోదీ మరింత లోతుగా మాట్లాడుతూ, ఏడాదికో ప్రధాని ఫార్ములా అంటే ప్రధాని కుర్చీని వేలానికి పెట్టడమే అవుతుందన్నారు. 'ఒక వ్యక్తి కుర్చీలో కూర్చుంటారు. ఆయన ఏడాది పదవీకాలం పూర్తయ్యేంత వరకూ తగ్గిన నలుగురు వేచిచూస్తుంటారు. ఇది చాలా భయానక ప్రతిపాదన. దేశాన్ని ధ్వంసం చేస్తుంది. ఇందవల్ల మీ స్వప్నాలు చెల్లాచెదురవుతాయని ర్యాలీకి హాజరైన ప్రజానీకాన్ని ఉద్దేశించి మోదీ అన్నారు. ఈనెల 26వ తేదీన లోక్సభ ఎన్నికల రెండో విడత పోలింగ్ జరుగనుంది. బుధవారం సాయంత్రంతో ఈ విడత పోలింగ్ ప్రచారానికి తెరపడింది.





# బిజెపి, బిఆర్ఎస్లకు డిపాజిట్లు రావు

## ప్రజాస్వామ్య పరిరక్షణకు కాంగ్రెస్ గెలవాలి: మంత్రి ఉత్తమ్ పిలుపు



**నల్లగొండ,ఏప్రిల్24 (ప్రజా మంటలు):** పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులకు డిపాజిట్లు కూడా రావని మంత్రి ఉత్తమ్కుమార్రెడ్డి అన్నారు. ఎన్నికల తర్వాత రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ మనుగడ ఉండదన్నారు. దేశంలోనే అత్యధిక మెజార్టీని నల్లగొండ పార్లమెంట్ నుంచి రఘువీర్కు అందించాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. ఎన్డీఏ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెట్టిందని, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అందుకోసం ఇండియా కూటమి గెలుపు చరిత్రాత్మక అవసరమన్నారు. రైతు ఆదాయాన్ని రెట్టింపు చేస్తానన్న మోదీ వారి ఆదాయాన్ని తగ్గించారని ఆరోపించారు. బీజేపీ వారికి ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. రాష్ట్రంలో 14 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని ఎన్నికల తర్వాత కొత్త రేషనకార్డులు ఇస్తామన్నారు. సాగర్లో 35 వేల ఎకరాలు ఎత్తిపోతల ద్వారా సాగవుతుందని వాటి పూర్తి మరమ్మతు బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు. నెల్లికల్లు ఎత్తిపోతలను రూ.200 కోట్లతో రెండేళ్లలో పూర్తి చేసి ఏడు వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనే రెండు లక్షల ఎకరాలకు, సాగర్ ప్రజలకు సాగునీరు అందించిన ఘనత తమదని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ అనేక ప్రాజెక్టులు కట్టిందన్నారు. పోడుభూముల చట్టం ద్వారా రాష్ట్రంలో 8 లక్షల మందికి లబ్ది చేకూరిందన్నారు. స్వామినాథన కమిషన ఏర్పాటును మోదీ ప్రభుత్వం విస్మరించిందన్నారు. కార్యకర్తలను కడుపులో పెట్టుకుని కాపాడుకుంటానని మంత్రి ఉత్తమ్ అన్నారు. పార్టీ విజయం కోసం కష్టపడి సమన్వయంతో పని చేసి అత్యధిక మెజార్టీ అందించాలని కోరారు. ఈప్రాంత అభివృద్ధికి కట్టుబడి ఉంటానన్నారు.

# ఇందూరు గౌరవం నిలబెడతా

## కాంగ్రెస్ గెలిస్తేనే అభివృద్ధి సాధ్యం: ఎంపి అభ్యర్థి తాటిపర్తి జీవన్ రెడ్డి





**నిజామాబాద్, ఏప్రిల్ 24 (ప్రజా మంటలు):** పార్లమెంట్ ఎన్నికల ప్రచార ఊపందుకుంటున్న వేళ నిజామాబాద్లో కాంగ్రెస్ అభ్యర్థి తాటిపర్తి జీవన్ రెడ్డి దూకుడుగా ముందుకు పోతున్నారు. గెలుపు తనదేనని ధీమాతో ఉన్నారు. వివిధ సమస్యలను ప్రస్తావిస్తూ ప్రచారం చేస్తున్నారు. ఈ క్రమంలో సిఎం రేవంత్ ప్రచరారంతో మరింత ఊపు వచ్చింది. సోమవారం జిల్లాకు వచ్చిన సీఎం రేవంత్రెడ్డి రాకతో కాంగ్రెస్లో ఉత్సాహం నిండింది. ప్రజల నుంచి స్పందన లభించింది. ఈ క్రమంలో ఎండ వేడిని ఉక్కబోతను ఏమాత్రం లెక్కచేయక సీఎం కోసం ప్రజలు ఓపికతో ఎదురుచూశారు. పౌరుషం గల రైతులు, కార్యకర్తలున్న ఇందూర్ గడ్డలో అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ గెలవాలని, పార్లమెంటులో వాణి వినబడాలని జీవన్ రెడ్డి అంటున్నారు. ధర్మపురి అర్వింద్ ఐదేళ్లుగా నిజామాబాద్కు చేసిందేమీ లేదన్నారు. పసుపుబోర్డు పేరుకు ప్రకటన వచ్చినా ఒరిగిందేమీ లేదన్నారు. 120 రోజుల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో ఐదు అమలు చేశామన్నారు. కాంగ్రెస్ పనైపోయిందని ప్రచారం జరుగుతున్న టైంలో రేవంత్రెడ్డి తిరిగి పార్టీని అధికారంలోకి తెచ్చిన మొనగాడని పేర్కొన్నారు. ప్రజల సేవకే ఇక తన జీవితం అంకితం చేశానని జీవన్రెడ్డి అన్నారు. రాజకీయాల్లో క్రమశిక్షణ ఉంటేనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఎన్డీయే ప్రభుత్వంతో మంచి సంబంధాలున్నా ఎంపీగా కవిత పసుపు, చెరకు రైతులకు అన్యాయం చేశారని ఆరోపించారు. ఎంపీగా అర్వింద్ అదే బాటలో నడిచారన్నారు. ఆయన నిర్లక్ష్యంతో పసుపు పంట సాగు విస్తీర్ణం తగ్గిందన్నారు. ఇప్పుడు బుద్ధిగా ఉంటాను మరో ఛాన్స్ ఇవ్వమని కోరుతున్న ఆయన్ను నమ్మొద్దన్నారు. తాను గెలిచాక ఇందూర్ ను స్మార్ట్ సిటీ చేస్తానని, రైల్వే సర్వీస్ లు పెంచుతానని జీవన్ రెడ్డి హామీ ఇచ్చారు.

# మిస్సింగ్ కేసు నమోదు

## జమ్మికుంట సీఐ రవి



**జమ్మికుంట ఏప్రిల్ 24 (ప్రజామంటలు):** బుధవారం శనిగరపు పుష్పలత భర్త పేరు ఓదేలు 32 సం"లు కులం ఎస్సీ మాదిగ గ్రామం పాపక్కపల్లి అను ఆమె తన తండ్రి మైస రామస్వామి (తండ్రి ఎల్లయ్య 70 సం.లు) గ్రామం సీతం పేట గత కొన్ని రోజుల నుండి తన బిడ్డ దగ్గరే ఉంటున్నాడు. తేదీ ఏప్రిల్ 19న ఉదయం పుష్పలత పనికి వెళ్లి తిరిగి 11:00 గంటలకు ఇంటికి వచ్చేసరికి తన నాన్న కనిపించలేదు. తన పిల్లలను అడిగితే పిన్ని వాళ్ళ ఇంటికి వెళ్ళాడని చెప్పినారు. చెల్లె వాళ్ళకి ఫోన్ చేసి తెలుసుకోనగా అక్కడకు రాలేదని చెప్పినారు. తర్వాత వాళ్లకు తెలిసిన బంధువుల ఇండ్లలో, ఊర్లో ఎక్కడ వెతికిన కనబడలేదు అని దరఖాస్తు ఇవ్వగా మిస్సింగ్ కేసు చేయనైనది అని జమ్మికుంట టౌన్ సీఐ వరగంటి రవి తెలిపారు.

# రాయబరేలిలో ప్రియాంక దిగితే... వరుణ్‌ను రెడీ చేసిన బిజెపి అధిష్టానం



లక్నో, ఏప్రిల్ 24 (ప్రజామంటలు): ఉత్తరప్రదేశ్‌లోని హై ప్రొ÷ల్ సీట్లలో ఒకటైన రాయ్‌బరేలీ నుంచి ఎవరు పోటీ చేస్తారనే విషయాన్ని అటు కాంగ్రెస్ గానీ, ఇటు బీజేపీగానీ ఇంకా వెల్లడించలేదు. అయితే ప్రియాంక గాంధీ రాయ్‌బరేలీ నుంచి పోటీ చేస్తారని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రియాంకకు పోటీగా నెహ్రూ-గాంధీ కుటుంబానికి చెందిన వరుణ్‌గాంధీని ఎన్నికల బరిలోకి దించాలని బీజేపీ నిర్ణయించింది. రాయ్‌బరేలీ నుంచి ఎన్నికల్లో పోటీ చేసేందుకు వరుణ్‌గాంధీకి బీజేపీ తాజాగా ఆఫర్ ఇచ్చిందని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే వరుణ్ తన సోదరి ప్రియాంకా గాంధీపై ఎన్నికల్లో పోటీ చేసే విషయంలో నిర్ణయం తీసుకునేందుకు కొంత సమయం అడిగారని సమాచారం. రాయ్‌బరేలీ అభ్యర్థుల ప్యానెల్‌లో వరుణ్ గాంధీ పేరును కూడా బీజేపీ కేంద్ర నాయకత్వం చేర్చినట్లు సమాచారం. రాయ్‌బరేలీ సీటు కాంగ్రెస్‌కు కంచుకోటగా పేరొందింది. ఈసారి సోనియా గాంధీ రాజ్యసభకు వెళ్లడంతో ప్రియాంక గాంధీ ఇక్కడి నుంచి పోటీ చేస్తారనే ఊహాగానాలు జోరుగా సాగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో వరుణ్‌గాంధీని రంగంలోకి దించితే కాంగ్రెస్‌కు గట్టిపోటీ ఎదురవుతుందని బీజేపీ అంతర్గత సర్వేలో వెల్లడైంది. ఈ నేపథ్యంలోనే వరుణ్ గాంధీని ఇక్కడి నుంచి పోటీచేయించేందుకు బీజేపీ రంగం సిద్ధం చేసింది. ఒకవేళ వరుణ్ గాంధీ రాయ్ బరేలీ నుంచి ఎన్నికల్లో పోటీ చేస్తే, గాంధీ కుటుంబ సభ్యులు ఒకరిపై ఒకరు పోటీ చేయడం 40 ఏళ్ల తర్వాత జరుగుతున్నట్లవుతుంది. 1984 లోక్‌సభ ఎన్నికల్లో వరుణ్ గాంధీ తల్లి మేనకా గాంధీ అమేథీ నుంచి రాజీవ్ గాంధీపై పోటీ చేశారు. అప్పట్లో ఆమె ఓటమిని ఎదుర్కొన్నారు. ఆ తరువాత మేనకా గాంధీ, సోనియా గాంధీ కుటుంబాలు పరస్పరం ఎన్నికల్లో పోటీకి దిగలేదు. ప్రస్తుతం యూపీలోని సుల్తాన్‌పూర్ స్థానం నుంచి మేనకా గాంధీ మరోసారి ఎన్నికల బరిలోకి దిగారు.

# కోమటిరెడ్డికి మంచి భవిష్యత్ ఉంది

**సిఎం రేవంత్ వ్యాఖ్యల్లో నిజం ఉంది: మంత్రి ఉత్తమ్ కుమార్ వెల్లడి**

నల్లగొండ,ఏప్రిల్24 (ప్రజామంటలు): మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి భవిష్యత్తులో సీఎం అయ్యే అర్హత ఉందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా అన్నారు. ఆయనకు కాంగ్రెస్‌లో మంచి భవిష్యత్ ఉందన్నారు. వెంకట్‌రెడ్డికి సీఎం అయ్యే అర్హత ఉందంటూ భువనగిరిలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలతో తాను ఏకీభవిస్తున్నట్లు ఆయన చెప్పారు. నల్లగొండలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కోమటిరెడ్డికి భవిష్యత్తులో మంచి అవకాశాలు వస్తాయన్నారు. కోమటిరెడ్డిని చూస్తే తనకు అసూయ కలుగుతుందన్నారు. కేంద్రం నుంచి రూ.700 కోట్లతో రింగ్ రోడ్డు నిర్మాణం,రూ. 280 కోట్లతో ఆర్ అండ్ బీ రోడ్ల నిర్మాణం ,రూ. 400 కోట్లతో నల్గొండ మున్సిపల్ అభివృద్ధి చేస్తున్నాడన్నారు. అయితే అదే వేదికపై ఉన్న వెంకట్‌రెడ్డి తనపై ఉత్తమ్ చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. తనకు ముఖ్యమంత్రి పదవిపై ఆశ లేదన్నారు. సీఎంగా రేవంత్ రెడ్డి ఉంటారని స్పష్టం చేశారు. తన పట్ల అభిమానంతో ఉత్తమ్ అలా మాట్లాడారని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. నల్గొండ లో బీఆర్ఎస్, బీజేపీలకు డిపాజిట్ దక్కదని ఉత్తమ్? అన్నారు. బీజేపీ తెలంగాణ కు చేసింది ఏమీ లేదని, వారికి ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. మోడీ నాయకత్వంలో ప్రజలకు అనాయ్యం జరిగిందన్నారు. బీఆర్ఎస్ పార్టీ గురించి మాట్లాడం దండగన్నారు. ఎన్నికల తర్వాత ఆ పార్టీ మనుగడ ప్రశ్నార్ధకరమన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ ఒక్క సీటు కూడా గెలవదన్నారు. ఎస్ఎల్‌బీసీ, డిండి, బీ వెల్లెంలతో పాటు పెండింగ్ ప్రాజెక్టులు కూడా పూర్తి చేస్తామని చెప్పారు. మిల్లర్లు తక్కువ ధరకు వడ్లను కొనుగోలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# నిజమైన స్నేహితులు






కిరణ్ 10వ తరగతి చదువుతున్నాడు. చాలా చలాకీ గలవాడు. స్నేహితులంటే ఇష్టం. ఎవరితోనైనా ఇట్టే కలిసిపోతాడు. బాగా చదువుతాడు చురుకుగా ఉంటాడు కాబట్టి అందరూ కిరణ్ చుట్టే తిరుగుతు%శీ%టారు. ఎప్పుడూ పదిమంది చుట్టూ ఉంటారు ఎవరైనా ఏదైనా అడిగితే ఇట్టే చేసి పెడతాడు ఏ వస్తువైనా అడిగినా ఇచ్చేస్తాడు.

కిరణ్ మనస్తత్వం తెలిసిన క్లాసులో పిల్లలందరూ వాళ్ళకు కావల్సినవన్నీ అడిగి తీసేసుకుంటారు. అనూప్ కు ఆల్జీబ్రా రాలేదని అగిగితే రెండు మూడు గంటలు శ్రమ తీసుకొని అర్థం అయేలా చెప్పాడు. మనిష్ రెండు రోజులు శలవు పెట్టాడని, హొంవర్కు చెయవల్సి ఉన్నప్పటికీ తన నోట్సులు రాసుకోవడానికి ఇచ్చాడు. పరీక్షలోని రిఫిల్ అయిపోయిందని సురేష్ బేల మొహం పెట్టాడని తను తెచ్చుకున్న ఎక్స్ ట్రా పెన్ ఇచ్చి ఆదుకున్నాడు. రికార్డులో బొమ్మలు వేయటం రావట్లేదని కిరీటి బాధపడుతుంటే ఒక రోజులో శ్రమపడి వేసిచ్చాడు. అందరి స్నేహితులు అనుకోవటం కిరణ్ మనస్తత్వం. దీన్ని చూసి కిరణ్ తల్లిదండ్రులు భయపడ్డారు.

ఇప్పుడు పదవ తరగతి పరీక్షలు వస్తున్నాయి కిరణ్ ఇలా అందరికీ సహాయం చేస్తూ పోతుంటే తనకు చదవటానికి సమయముండదు. కిరణ్ చురుకైనవాడే అయినప్పటికీ తాను చదువుకోవాలి కదా ! ఉన్న సమయమంతా స్నేహితులని వాళ్ళకు ఖర్చుపెట్టేస్తే పరిక్షల్లో మార్కులు ఎలా వస్తాయో ఏమో అని భయపడ్డారు. అదే విషయం కిరణ్ కు చెప్పారు.

కాని కిరణ్ కు విషయం అర్థం కాలేదు "వాళ్ళంతా నా బెస్ట్ ఫ్రెండ్స్ అమ్మా. వాళ్ళకు హెల్ప్ చేయులని మీరే కదా చెప్పారు" అన్నాడు కిరణ్ .

"అలా కాదు కిరణ్. అందరూ బెస్ట్ ఫ్రెండ్స్ ఉండరు. ఇప్పటి వరకు నువ్వే వాళ్ళకు హెల్ప్ చేస్తున్నావు కాబట్టి వాళ్ళు బెస్ట్ ఫ్రెండ్స్ లానే ఉన్నారు. నీవు ఏదన్నా సహాయం అడిగి చూడు అప్పుడు నీకు ఎంత మంది సహాయం చేస్తారో గమనించు. అప్పుడు నీకూ ఎవరు స్నేహితులో అర్థం అవుతుంది" అన్నారు అమ్మానాన్నలు దీనికొక ఉపాయం కూడా అలోచించి పెట్టారు.

తెల్లవారి కిరణ్ చేతికి పెద్ద కట్టు కట్టారు. సైకిల్ మీద నుంచి పడ్డానని ఎముక కొద్దిగా చిట్లిందని చెప్పారు. డాక్టరు స్కూలుకు పోవద్దన్నాడని చెప్పారు. క్లాసులో ఉన్న స్నేహితులు అందరూ వచ్చి చూసి వెళ్ళారు. కిరణ్ ను చూసి చాలా బాధపడ్డారు. తమ హొం వర్కులు ఎవరు రాస్తారు? తమ బొమ్మలు ఎవరు వేస్తారు.అడిగాడు. తమకు అర్థం కానీ లెక్కలు ఎవరు చెప్తారు? అని చాలా చింతించారు. అందరూ మాట్లాడుతున్నారు గానీ సంతోషంగా లేరు.

నాలుగు రోజుల తర్వాత కిరణ్ వాళ్ళ స్నేహితులకు తన పుస్తకాలు ఇచ్చి హొం0వర్కులు రాయమని బొమ్మలు వేయమని కానీ అందుకు ఎవరూ సుముఖంగా లేరు. ఒకరేమో నాకు చెయ్యి నెప్పిగా ఉందని, మరొకరేమో మా నాన్న తిడతాడని ఇలా ఏవేవో కారణాలు చెప్పారు. క్లాసులో చెప్పిన పాఠానైనా తనకు చెప్పమని అడిగాడు కిరణ్. నేను కూడా క్లాసులో టిచర్ చెప్పినపుడు సరిగా వినలేదు అంటూ స్నేహితుడు తప్పించుకున్నాడు. కిరణ్ చాలా ఆశ్చర్య పోయాడు. ఇలా ఉంటారా స్నేహితులంటే అనుకున్నాడు. కిరణ్ మొహం బాధతో నిండి పోయింది.

అమ్మా నాన్నలు అప్పుడు చెప్పారు. "చూశావా కిరణ్, నువ్వు సహాయం చేస్తున్నంతసేపూ అందరూ స్నేహితుల్లా ఉన్నారు. నువ్వు సహాయం అడిగేసరికి ఒక్కరూ రాలేదు. ఇలాంటి వాళ్ళకు సహాయం చేస్తూ మన సమయాన్ని వృథా చేసుకోగూడదు. నిజమైన స్నేహితులకు మాత్రమే సహాయం చెయ్యాలి. నిజమైన స్నేహితులు ఎవరో తెలియాలంటే మనమూ వాళ్ళను సహాయమడిగి చూడాలి అప్పుడే తెలుస్తుంది నిజమైన స్నేహితులు ఎవరో". కిరణ్ కు అర్థం అయింది. నిజమైన స్నేహితుల్ని గుర్తించడం నేర్చుకున్నాడు.

- డా.. కందేపి రాణీప్రసాద్,
సిరిసిల్ల

## కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కులను ఎగ్గొట్టారు

**మడికొండ సభలో శ్రీధర్ బాబు ఆగ్రహం**

హన్మకొండ, ఏప్రిల్24 (ప్రజామంటలు): బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై మంత్రి శ్రీధర్ బాబు ఫైర్ అయ్యారు. గత పదేళ్లుగా బీజేపీ, బీఆర్ఎస్ కలిసి నడిచాయని.. ఒకరికొకరు సహాయం చేసుకున్నారన్నారు. కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ ఇవ్వకుండా బీజేపీ తెలంగాణకు మోసం చేసిందని మండిపడ్డారాయన. ఏప్రిల్ 24వ తేదీ బుధవారం సాయంత్రం హన్మకొండ జిల్లా మడికొండలో కాంగ్రెస్ జనజాతర సభ నిర్వహించింది. ఈ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పలువురు మంత్రు లు, కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. దేశంలో ప్రతి ఏడాది 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి.. . ఉద్యోగాలు ఇవ్వకుండా మోదీ సర్కార్ యువతను మోసం చేసిందన్నారు. మేనిఫెస్టోలో పొందుపర్చిన ప్రతి అంశాన్ని అమలు చేసి తీరుతామని స్పష్టం చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేస్తుంటే బీఆర్ఎస్ భయపడుతోంద న్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే వచ్చేసారి ఎన్నికల్లో పోటీ చేయమని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు.

# కెసిఆర్ వితండవాదం !

తప్పులెన్ను వారు తమ తప్పులెరగరు..అని శతకకారుడు ఎప్పుడో చెప్పాడు. అది కెసిఆర్ విషయంలో బాగా పనికి వస్తుంది. ఎన్నో తప్పులు చేసినా..కనీసం ఒక్కటయినా ఒప్పుకోవడానికి ఆ మహానుభావుడు సిద్దంగా లేదు. అందులో ప్రధానమైనదే ఫోన్ ట్యాపింగ్ అంశం. మొత్తానికి ఫోన్ ట్యాపింగ్‌తో తమకు సంబంధం లేదని మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఒక్కముక్కలో తేల్చేశారు. పోలీసులు విధి నిర్వహణలో భాగంగా చేసే పనికి తమకు సంబంధం లేదన్నారు. ఫోన్ ట్యాపింగ్ సిల్లీ, థర్డ్ క్లాస్ ఆరోపణ. లా అండ్ ఆర్డర్ కాపాడటానికి, ప్రతీప శక్తులను అడ్డుకోవడానికి పలు మార్గాల్లో పోలీసులు సమాచారం సేకరిస్తుం టారు. అందులో ఇంటర్‌సెప్షన్ ఒకటి. అది అధికారికంగా చేస్తారు. 'ఫలానా వ్యక్తుల ఫోన్లను ట్యాప్ చేసినం' అని అధికారులు ముఖ్యమంత్రి కి చెప్పరు. సీఎంకు సంబంధముండదు. ఇప్పుడున్న ముఖ్యమంత్రికీ రోజూ ఇంటెలిజెన్స్ బ్రీఫింగ్ వస్తుంది. దీన్నికూడా రాజకీయం చేయడమంటే దివాళాకోరుతనం ఇంకోటి ఉండదని ఓ టీవీ ఛానల్ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. ఇంతకాలం మౌనంగా ఉంటూ తనపై వచ్చిన ఆరోపణలను ఇలా కొట్టి పడేశారు. అయితే ఇప్పటి వరకు జరిగిన, జరుగుతున్న దర్యాప్తులో అనేక విషయాలు బయట పడుతున్నాయి. వాటి గురించి మాట్లాడ లేదు. మళ్లీ అసెంబ్లీ ఎన్నికలు జరిగితే మాత్రం తానే సిఎంనని కూడా చెప్పుకున్నారు. నిజానికి ఇలా జరుగుతాయా అన్నది ఆయనకే తెలియాలి. ఆర్థిక దివాళా అన్నది అతిపెద్ద సమస్య. దీనిపై స్పష్టమైన ప్రకటన చేయలేదు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత టీఆర్ఎస్ అంటే ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ తెలంగాణలో అధికారంలో వచ్చింది. కేసీఆర్ అధికార పగ్గాలు చేపట్టిన అనంతరం తెలంగాణలో ఉద్యమ నినాదాలకు తిలోదకాలు ఇచ్చి నియంతృత్వ పాలన సాగించారు. నేనే రాజు,నేనే మంత్రి అనే రీతిలో నియంత పాలన సాగింది. ప్రతిపక్షాలు లేని వ్యవస్థ కావాలని కలలు కన్నారు. ప్రతిపక్షాలను గౌరవించకుండా, వాటిని గుర్తించకుండా పాలన చేశారు. ఏ ఒక్క సందర్భంలోనూ పదేళ్ల కాలంలో ఆయన విపక్షాలతో చర్చించలేదు. సంచలనం కలిగించిన పేపర్ లీకేజీలు, మేడిగడ్డ కుంగుబాటు వంటి సమస్యలను కూడా ఏనాడు చర్చించలేదు. అసెంబ్లీలో చర్చ లేకుండా చేశారు. ఇకపోతే ప్రతిపక్షమే లేకుండా చేయాలని చూసి కాంగ్రెస్, టిడిపి, సిపిఐ ఎమ్మెల్యేలను గంపగుత్తగా తన మందలో కలుపుకున్నారు. దీనికి తెలంగాణ పునరేకీకరణ అని చెప్పుకొచ్చారు. ఈ పార్టీలకు తెలంగాణలో ఉనికి లేకుండా చేశారు. ఆ తరువాత కాంగ్రెస్ నాయకులను కూడా కొనుగోలు చేసి ఆ పార్టీని బలహీనపర్చారు. ఇప్పుడు పార్టీ మారిన ఎమ్మెల్యేలపై వేటువేయండి అంటున్న నేతలంతా అప్పుడు నిర్లజ్జగా ఎమ్మెల్యేలను కలుపుకున్నారు. అసెంబ్లీలో ఎవ్వరినీ మాట్లాడనీయకుండా చేశారు. మాట్లాడిన వారిని సస్పెండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ప్రత్యేక పాత్ర పోషించిన అన్ని పార్టీల ఎమ్మెల్యేను కూడా దుర్మార్గంగా టీఆర్ఎస్‌లో చేర్చుకున్నారు. 2018లో టీఆర్ఎస్ పార్టీ మరోసారి అధికార పగ్గాలు చేపట్టిన తరువాత అదే పనిని కొనసాగించారు. తెలంగాణ అంటే టీఆర్ఎస్ అంటే నేనే అనే అహంభావంతో కెసిఆర్ వ్యవహరిం చారు. అందుకే ప్రభుత్వం పడిపోయాకనే జరిగిన అనేక అవతవకలు అక్రమాలు బయటకు వస్తున్నాయి. ఈ క్రమంలో ఫోటన్ ట్యాపింగ్‌ను తూఛ్.. అన్నంత మాత్రాన అది పోయేది కాదు. నిజాలు నిగ్గు తేలుస్తారు. ఎవరెవరు ఎలా వ్యవహరించారో, ఎంతగా బరితెగించారో తెలుస్తోంది. ప్రభుత్వ యంత్రాంగంలోతనకు నచ్చిన ఐఏఎస్, ఐపీఎస్‌లు, ఉన్నతాధికారులు.. అంటే చెబితే వినే వారిని ఏళ్లుగా ఒకే పదవిలో కొనసాగించారు. పది జిల్లాల తెలంగాణ 33 జిల్లాలు చేసి పరిపాలన చిన్నాభిన్నం చేశారు. ఇలాచేసి ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేశారు. అనవసరంగా కలెక్టరేట్ల నిర్మాణాలకు తగలేశారు. ఇలాంటి సమయాల్లో కూడా విపక్షాలతో చర్చించాలన్న ఇంగితం కెసిఆర్ ప్రదర్శించలేదు. ఏకపక్షనిర్ణయాలు, నియంతృత్వం పోకడలు భరించలేనంతగా సాగాయి. ఉద్యమంలో పాల్గొన్న మేధావుల సలహాలు తీసుకోకపోవడం అటుంచి వారిని గడపకూడా తొక్కనీయలేదు. ఏకవ్యక్తి పోకడలతో అధికార దుర్విని యోగానికి పాల్పడ్డాడు. చట్టాలను చట్టుబండలు చేశాడు. మాట్లాడిన వారిపై కేసులు పెట్టారు. ప్రాజెక్టుల్లో అయితే భారీగా అవినీతి బయటపడింది. రైతులను రోడ్డున పడేశారు. ఊళ్లకు ఊళ్లు ఖాళీ చేయించి జులుం చలాయించారు. అయినా వారికి గౌరవంగా దక్కాల్సిన పరిహారం దక్కలేదు. సాగునీటి ప్రాజెక్టులు పనులను పక్కకు పెట్టి మేడిగడ్డ అన్నారు. సుందిళ్ల బ్యారేజిలు కట్టి కాళేశ్వరం రూపొందించారు. కాళేశ్వరం పేరుతో ప్రత్యేక కార్పొరేషన్ పెట్టి దాదాపు 94 వేల కోట్ల రూపాయల ఖర్చు చేశారు. ఇలా ఇబ్బడిముబ్బడిగా చేసిన అప్పులు ఆర్థిక అరాచకత్వానికి అద్దం పడుతున్నది. అడ్డగోలుగా విద్యుత్ వ్యయం, అప్పులు, వడ్డీలు, కాళేశ్వరం ప్రాజెక్టు రూపేణా ప్రభుత్వం మీద ఆర్థిక భారం మోపారు. సాగునీటి ప్రాజెక్టు నిర్మాణం విషయం లో కేసీఆర్ ఒంటెద్దు పోకడలు అనేక తప్పటడుగులు వేశారు. సిద్ధిపేటతోపాటు కేసీఆర్ ఫామ్‌హౌజ్‌కు నీళ్లు వచ్చే విధంగా కొండపోచమ్మ రిజర్వాయర్ నిర్మాణం చేపట్టారు. మేడిగడ్డ వద్ద పిల్లర్లు కుంగిపోవడం, సుందిళ్ల వద్ద ప్రాజెక్టులకు బుంగలు పడటం కేసీఆర్ మార్కు పాలనకు అద్దం పడుతోంది. ప్రజాసమస్యల వేదిక ప్రజాగొంతుక అయిన ఇందిరాపార్కు ధర్నాచౌక్ ఎత్తివేసిన ఘనత కూడా కేసీఆర్‌కే చెల్లుతుంది. ఇలా అనేక అవకతవకలు, అక్రమాలకు పాల్పడ్డ కెసిఆర్..తప్పులను ఒప్పుకోవడానికి సిద్దంగా లేరు. ఇంకా నాలుగు నెలల క్రితమే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలకులపై ఎదురుదాడికి దిగుతున్నారు. వారు ఏమీ చేయడం లేదని రోడ్డెక్కి గోల చేస్తున్నారు. రాజకీయాలను భ్రష్టు పట్టించిన కేసీఆర్‌కు ఇప్పుడు బీఆర్ఎస్ మునిగిపోయే ప్రమాదం ఏర్పడింది. అయినా తండ్రీ కొడుకులు, అల్లుడు బింకం వదలడం లేదు. కవిత లిక్కర్ కేసు ఉత్తిదే అంటారు. ఫోన్ ట్యాపింగ్ ఉత్తిదే అంటారు. అప్పులు చేసి అభివృద్ధి చేశామంటారు. ఇలా వారు చెప్పినవి నమ్మితే మోసపోయేది ప్రజలే.

# సాహితీ దిగ్గజం తిరునగరి

**ఏప్రిల్ 25.. తిరునగరి రామానుజయ్య తృతీయ వర్ధంతి**



రామ కిష్టయ్య సంగన భట్ల..
9440595494



అభినవ మహాకవి, భారతి భాష భూషణ్ దాశరథి కృష్ణమాచార్య పురస్కార గ్రహీత డాక్టర్ తిరునగరి ఈ లోకాన్ని వదిలి ఏడాది అయ్యింది. తిరునగరి రామానుజయ్య (సెప్టెంబరు 24, 1945 - ఏప్రిల్ 25, 2021) తెలంగాణ రాష్ట్రంకు చెందిన సాహితీవేత్త, పద్యకవి. పద్యం, గేయం, వచన ప్రక్రియలలో సాహిత్య కృషి చేశారు. పద్యకవి, వచనకవితా కవి, కవిత్వ విమర్శకుడు తిరునగరి.

తిరునగరి యాదాద్రి జిల్లా రాజపేట మండలంలోని బేగంపేట గ్రామంలో శ్రీమతి జానకిరామక్క, మనోహర్ దంపతులకు 1945 సెప్టెంబర్ 24న జన్మించారు.

కవిత్వమే శ్వాసగా జీవించే కవిత్వోపాసకులు ఆయన. మానవత్వం తన కవిత్వ వస్తువుగా, మానవ వేదనలను కవిత్వీకరించటంలో ఆయన ఘనాపాటి. టి. అసాధారణ ధారణా శక్తితో ఎందరో రచనలను ఉదాహ రిస్తూ, ఆశువుగా పద్యాలు చెప్తూ తాను చేసే సాహిత్యో పన్యాసాలు చేయడంలో తనకు తానే సాటి. సహజ, సరళ శైలిలో రాయడంలో దిట్ట. కవిత్వ రచన, విమర్శనం, వ్యాఖ్యానాలు ఆయనకు కరతలామలకాలు. మూడు దశాబ్దాల పాటు తెలుగు భాషో పాధ్యాయుడుగా, తెలుగు ఉపన్యాసకులుగా పనిచేసిన తిరునగరి వేలాదిమంది శిష్యులకు వందనేయులు, ఆరాధ్యులు. తెలుగు, సంస్కృతం, ఆంగ్ల త్రి భాషల్లో పట్టు సాధించి, ప్రాచ్య, పాశ్చాత్య కవిత్వ సిద్ధాంతాలను ఆకళింపు చేసుకుని, గత ఐదు దశాబ్దాల నుంచి నిరంతర సాహిత్య సేవకు అంకితమైన సాహితీవేత్త.

ఆయన సాహిత్య వ్యాసాలు వెయ్యికి దాటే వుంటాయి. గొప్ప గేయ రచయిత కూడా. తిరునగరి వందలాది లలిత, దేశభక్తి, ప్రబోధాత్మక గేయాలు రచించారు. వందలకొద్ది సాహిత్య సదస్సులలో, కవి సమ్మేళనాలలో ప్రధానవక్తగా పాల్గొన్నారు. అనితర సాధ్యమైన ప్రసంగాలు చేసారు.

హైదరాబాదులోని ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల నుండి దాదాపు 100 లలిత, దేశభక్తి గీతాలు, కవితలు, ప్రసంగాలు ప్రసారమయ్యాయి. ప్రైవేట్ ఆల్బమ్స్ కు భక్తి గీతాలు, ప్రబోధగీతాలు రాశారు. అయన వరంగల్ వాణి, ఆంధ్రపత్రికకు ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా పనిచేశారు. ఆంగ్లం, హిందీ నుండి కవితలు, వ్యాసాలు అనువాదం చేశారు.

తిరునగరి జీవితం - సాహిత్యం అన్న అంశాలపై ఉస్మానియా విశ్వ విద్యాలయం తెలుగుశాఖలో పరిశోధనలు జరిగాయి.

పాతికకు పైగా ప్రభుత్వ, ప్రభుత్వేతర పుర స్కారాలు ఆయన అందుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా యిచ్చే దాశరథి పురస్కారం-2020 గ్రహీత ఆయన.

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ఆం.ప్ర. ప్రభుత్వ సత్కారం (1975), నల్లగొండ జిల్లా ఉత్తమ ఉపాధ్యా యుడుగా సత్కారం (1976,1978), యాదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పండిత సత్కారం (1992), బి.ఎన్.రెడ్డి సాహిత్య పురస్కారం (1994), ఆం.ప్ర. ప్రభుత్వ కళానీరాజన పురస్కారం (1995),

ఆం.ప్ర. ప్రభుత్వ విశిష్ట (ఉగాది) పురస్కారం (2001), విశ్వసాహితి' ఉత్తమ పద్యకవి పురస్కారం (2003), భారత్ భాష భూషణ్ (డాక్టరేట్) అఖిల భారత భాషా సాహిత్య సమ్మేళనం భోపాల్, మధ్యప్రదేశ్ (2003), ఆటా (అమెరికా తెలుగు అసోసియేషన్) సత్కారం (2006), ఆం.ప్ర. ప్రభుత్వ అధికార భాషా సంఘం సత్కారం (2006), రాచమళ్ళ లచ్చమ్మ స్మారక 'మాతృమూర్తి' అవార్డు, నల్గొండ (2008), ప్రతిభా పురస్కారం 2012 - తెలుగు విశ్వవిద్యాలయం, 2014, వేదా చంద్రయ్య తెలంగాణ రాష్ట్ర స్థాయి పురస్కారం (2015),

పద్మశ్రీ ఎస్.టి. జ్ఞానానందకవి సాహిత్య పురస్కారం (2016),

శ్రీ కృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం దాశరథి పురస్కారం (2017), గిడుగు తెలుగు భాషా పురస్కారం (2017), సారిపల్లి కొండలరావు, యువకళా వాహిని సాహిత్య పురస్కారం (2019), ఆరాధన సాహిత్య పురస్కారం (2019), అభినందన సినారె సాహిత్య పురస్కారం (2019), డా. దాశరథి వంశీ జీవిత సాఫల్య సాహితీ పురస్కారం (2019), తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ దాశరథి సాహితీ పురస్కారం - 2020, ఆగస్టు 15న ప్రగతి భవన్ లో సీఎం కల్వకుంట్ల చంద్ర శేఖర్ రావు చేతుల మీదుగా, ఇలా ఎన్నో పురస్కారాలు, సన్మానాలు అందుకున్నారు.

ఔద్యోగిక సమయంలో యాదాద్రి జిల్లా ఆలేరులో నివాస మేర్పరచు కున్నారు. ప్రస్తుతం చింతల్(హెచ్ ఎం టి)లోని గణేశ్ నగర్ లో విశ్రాంత జీవితాన్ని గడుపుతుండే వారు. మూడేళ్ల క్రితం ఏప్రిల్ 25న ఈ లోకాన్ని వదిలి వెళ్లారు.

# ఇంటర్ ఫలితాలలో ఎస్ ఆర్ టి కళాశాల విద్యార్థుల హవా

## డివిజన్ టాపర్ గా 'గాడిపల్లి ఆలన' 964/1000







**భీమదేవరపల్లి ఏప్రిల్ 24 (ప్రజామంటలు):** మండలంలోని ముల్కనూర్ స్వామి రామానంద తీర్థ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాలలో రాష్ట్రస్థాయి మార్కులతో ప్రభంజనం సృష్టించారు. బుధవారం ప్రకటించిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ లో నగరబోయిన సింధూర 428/470, దీకొండ చందర్, 414/470, సీఈసీ విభాగంలో మహమ్మద్ తోఫిక్ 462/500, ఎంఎల్ టి విభాగంలో చిదురాల సీతు 468/500, గిన్నారపు మౌనిక 419/500, ఎంపిహెచ్ డబ్ల్యు విభాగంలో గొల్లపల్లి సిరివెన్నెల 413/500, చల్లూరి అఖిల 409/500 మార్కులు సాధించి డివిజన్ టాపర్స్ గా నిలిచారు. అదేవిధంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాలలో గాడిపల్లి ఆలన 964/1000 రాష్ట్రస్థాయి మార్కులు సాధించి, హుస్నాబాద్ డివిజన్ టాపర్గా నిలవడం జరిగిందని ప్రిన్సిపాల్ ఎదులాపురం మొగిలి తెలిపారు. సిఈసి విభాగంలో పోలు మాధవి 945/1000, బోడ సింధు 920/1000, ఎంపిహెచ్ డబ్ల్యు విభాగంలో రాచకొండ కళ్యాణి 937/1000, ఉడే అనూష 911/1000 మార్కులు సాధించి డివిజన్ టాపర్స్ గా నిలిచినట్లు తెలిపారు. ఈ ఫలితాల పట్ల కళాశాల కరస్పాండెంట్ ఎమ్మెల్సీ సురభి వాణి దేవి, అధ్యాపక బృందం, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

# ఇంటర్ ఫలితాలలో జిల్లా స్థాయి మార్కులు సాధించిన టీఎస్ మోడల్ జూనియర్ కళాశాల విద్యార్థులు

## కళాశాల టాపర్ గా టి. శ్రీలేఖ 960/1000 - అభినందించిన అధ్యాపక బృందం



**భీమదేవరపల్లి ఏప్రిల్ 24 (ప్రజామంటలు):** ములుకనూరు లోని తెలంగాణ స్టేట్ మోడల్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాలలో జిల్లా స్థాయి మార్కులను సాధించినట్లు ప్రిన్సిపాల్ బి. కుమార్ ఒక ప్రకటనలో తెలియజేశారు. బుధవారం వెలువడిన ఫలితాలలో బైపీసీ ప్రథమ సంవత్సరములో పులి పూజిత 431/440, పి. పూజ 416/440, ఎంపీసీ విభాగంలో కే. మైత్రి 451/470, బండి అకిత 442/470 ప్రథమ ద్వితీయ స్థానాలలో నిలిచినట్లు తెలిపారు. అలాగే ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు టి. శ్రీలేఖ ఎంపీసీ విభాగంలో 960/1000, బైపీసీ విభాగంలో 955/1000 ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయిలో కళాశాల పేరు నిలబెట్టినట్లుఅధ్యాపక బృందం హర్షం వ్యక్తం చేశారు.




## ఇంటర్మీడియట్ లో ప్రతిభ కనబరిచిన

# కస్తూరిబా విద్యార్థినీలు

**ఎల్కతుర్తి ఏప్రిల్ 24 (ప్రజామంటలు):** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని కస్తూరిబా విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించినందుకు కస్తూరిబా ప్రిన్సిపాల్ అనితాదేవి మాట్లాడుతూ తమ పిల్లలు ఇంటర్మీడియట్ లో ఫస్ట్ ర్యాంక్ సాధించినందుకు విద్యార్థినులను అభినందించారు. సెకండియర్ స్పందన 873 ఫస్ట్ ఇయర్ అడ్డూరి కావ్య 428 ప్రైవేటు పాఠశాలలకు దీటుగా మార్కులు సాధించినందుకు విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ అనిత దేవి టీచర్ల బృందం పిల్లలకు అభినందనలు తెలిపారు. చింతలపల్లి అడ్డూరి రమేష్ కావ్య వాళ్ళ నాన్న తమ పిల్లలను మంచి మార్కులు సాధించినందుకు పాఠశాల ప్రిన్సిపాల్ టీచర్ల బృందానికి తల్లిదండ్రులు రుణపడి ఉంటామని తెలిపారు. విద్యార్థులు, స్నేహితులు శుభాభినందనలు తెలిపారు.

## ఇంటర్ ఎంపీసీ లో

## వైష్ణవి 983/1000, నందిని 942/1000




**రాయికల్ ఏప్రిల్ 24 (ప్రజామంటలు):** బుధవారం విడుదలైన ఇంటర్ ఫలితాల్లో రాయికల్ మండలంలోని ఇటిక్యాల్ మోడల్ స్కూల్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగానికి చెందిన బుషనవేణి వైష్ణవి 983/1000, రాయికల్ పట్టణంలోని ప్రణుతి జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగానికి చెందిన విద్యార్థిని గుండారపు నందిని 942/1000 రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ శ్రీధర్, ప్రణుతి కళాశాల చైర్మన్ మ్యాకల రమేష్, ప్రిన్సిపల్ వెంకటేశ్వర రావు, కరస్పాండెంట్ గూడూరి రాము, డైరెక్టర్లు ఏసాల గంగారెడ్డి, గట్టు వినయ్, బండి దిలీప్, మచ్చ శేఖర్, ఉడుత రమేష్, వినయ్, అధ్యాపక బృందం అభినందించారు.

## ఆరూరి రమేష్ గెలుపు కొరకు

## భాజపా ఇంటింటి ప్రచారం

**ఎల్కతుర్తి ఏప్రిల్ 24 (ప్రజామంటలు):** భారతీయ జనతా పార్టీ అప్ కి బార్ 400 పర్, అప్ కి బార్ మోడీ సర్కారు,అనే నినాదం తో వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేష్ గెలుపే లక్ష్యంగా ఉదయం 9:00 గంటలకు 56 డివిజన్ సదాశివ కాలనీ మరియు జవహర్ కాలనీ పలు కాలనీ లలో ఇంటింటికి ప్రచారం నిర్వహించడం జరిగింది . ఆరూరి రమేష్ గెలుపే లక్షయంగా ప్రతి ఇంటినీ ప్రతీ గడపను తట్టి కేంద్రం సంక్షేమ పతకాలు వివరిస్తూ కేంద్రంచే లబ్ది పొందిన లబ్దిదారులను కలుస్తూ ప్రచారంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు మందోటి మహేందర్ పటేల్, డివిజన్ ఉపాధ్యక్షులు లేగల శివరాం, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి తక్కళ్లపల్లి అమృతరావు, జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి కటకం రాజేష్, బూత్ అధ్యక్షులు పేరాల కుమారస్వామి, కోటగిరి నరేందర్ వేల్పుల శ్రీనివాస్, తంగళ్లపెల్లి రాంచందర్, యోగేష్, రాంచందర్ తదితరులు ఈ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు.



# రైతు మిత్ర కార్యాలయం ప్రారంభించిన కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

**రాయికల్ ఏప్రిల్ 24 (ప్రజామంటలు):** అల్లిపూర్ గ్రామంలో అల్లిపూర్ రైతు మిత్ర ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ యొక్క ఆఫీస్ ను జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడూతూ.... అల్లిపూర్ రైతు మిత్ర ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ గత సంవత్సరం నాబార్డ్ చేత శాంక్షన్ చేయబడిందని, ఈ సంవత్సరం మార్చి నెలలో రిజిస్టర్ కావడం జరిగిందని, కంపెనీ ఈ కంపెనీలో దాదాపు 300 మంది 50 ఫార్మర్స్ అయ్యారు అలాగే దాదాపు 5 లక్షల వరకు షేర్ క్యాపిటల్ కూడా కలెక్ట్ చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా ఈ కంపెనీ దాదాపు అల్లిపూర్ చుట్టుపక్కల 6 గ్రామాలకు కవర్ చేస్తుందని, అలాగే ఈ అలిపూర్ కంపెనీలో ముఖ్యమైన పంటలు వరి మామిడి పసుపు కొన్ని రకాల వెజిటేబుల్స్, ఈ ఎఫ్ పి సి ఎల్ కి నాబార్డ్ దఫా దఫాలుగా 43 లక్షలు మూడు నుంచి ఐదు సంవత్సరాలు కాలంలో గ్రాంట్ చెల్లించడం జరుగుతుంది అలాగే ఈ ఎఫ్ఓకి ఒక సీఈఓ అకౌంటెంట్ ఉండడం జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే బిజినెస్ ప్లాన్ కూడా ప్రిపేర్ చేయడం జరుగుతుందని, దీని యొక్క ముఖ్య ఉద్దేశము రైతులను సంఘటితం చేసి రైతులకు లాభసాటి వ్యవసాయాన్ని ఇవ్వడము, అలాగే రైతులకు ఈ ప్రాస్సింగ్ ఫెసిలిటీస్ కావచ్చు, రైతులకు ఇంకా తక్కువ ధరకే మనకు ఫెర్టిలైజర్స్ కావచ్చు, బిస్కెట్స్ కావచ్చని తెలిపారు. అనంతరం మేడిపల్లి రాయికల్ మండలం మరియు జగిత్యాల రూరల్ మండలంలో ఒక్కొక్క మండలానికి ఒకటి చొప్పున 350 మనకు మంజూరు చేయడం జరిగింది. ఈ కార్యాలయ ఆరంభానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ%ఔ%. దీనిలో ఉన్న సభ్యులు రెగ్యులర్గా చేసే రీతిలో వ్యవసాయం కాకుండా సృజనాత్మకంగా విజ్ఞానాన్ని ఉపయోగిస్తూ లేటెస్ట్ టెక్నాలజీ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వాడుతూ అదనంగా లాభాలను అర్జించాలని సూచించారు. అలాగే రైతులందరూ కూడా సుస్థిర వ్యవసాయం వైపు అడుగులు వేయాలని, వైవిధ్యభరిత పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఒక రైతు తన అవసరాలకు సంబంధించిన అన్ని రకాల ధాన్యాలని కూరగాయలను గాని తనే తన పొలంలో పండించుకునేలా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.. ఇంకా ఈ ఉత్పత్తిదారుల సంఘం లో ఉన్న సభ్యులను వివిధ ప్రదేశాల్లో అభ్యుదయ రైతులు పండిస్తున్న వివిధ రకాల పద్ధతులను గమనించేలా క్షేత్రస్థాయి ప్రదర్శనలకు ఏర్పాటు చేయాల్సిందిగా అధ్యక్షుల వారిని అధ్యక్షులు వారిని కోరడం జరిగింది. అలాగే వ్యవసాయ అధికారులను గాని బ్యాంకు వారిని కానీ శాస్త్రవేత్తలు గాని ఈ సభ్యులకు ఆధునిక ఎప్పటికప్పుడు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాల్సిందిగా సూచించారు. అలాగే రైతులు సేంద్రియ వ్యవసాయం సహజ వ్యవసాయం వైపు కూడా చూస్తూ మన నేలను, ఆరోగ్యాలను రక్షించుకోవాలని, మన ముందు తరానికి ఒక మంచి వాతావరణాన్ని ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మనకి ఎఫ్ పీ ఓ ప్రెసిడెంట్ శంకర్ అలాగే మనకు లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకట్ రెడ్డి అలాగే మనకు నాబార్డ్ ఇది మనోహర్ రెడ్డి అలాగే డిస్టిక్ అగ్రికల్చర్ ఆఫీసర్ వాణి, అగ్రికల్చర్ స్టేషన్ పొలాస సైంటిస్ట్ రజనీ దేవి అలాగే లోకల్ బ్రాంచ్ టిజిబి బ్యాంకు మేనేజర్ పాల్గొన్నారు.




# మండల బిఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం

## పాల్గొన్న పెద్దపల్లి మాజీ లైబ్రరీ చైర్మన్ రఘువీరు సింగ్



**గొల్లపల్లి ఏప్రిల్ 24 (ప్రజామంటలు):** ధర్మపురి నియోజకవర్గం రానున్న లోక్ సభ ఎన్నికల్లో నేపథ్యంలో మాజీ మంత్రి పెద్దపల్లి పార్లమెంటరీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ఆదేశాల మేరకు గొల్లపల్లి మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన ధర్మపురి నియోజకవర్గ ఎంపీ ఎలక్షన్ ఇంచార్జి రఘువీరు సింగ్. ఈ సందర్భంగా రఘువీరు సింగ్ మాట్లాడుతూ.... దేశ రాజకీయాల్లోనే ఒక ప్రభలమైన శక్తిగా బీఆర్ఎస్ పార్టీ ఉంది. దేశంలో ఏ రాజకీయ పార్టీకి లేని అరుదైన ఖ్యాతి గౌరవం బీఆర్ఎస్ సొంతం. తెలంగాణను దేశంలోనే ఒక రోల్ మోడల్ గా తీర్చిదిద్దిన వ్యక్తి కేసీఆర్ లక్షల ఉన్న కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో ఉన్నారు.టిఆర్ఎస్ పార్టీ ఉద్యమం నుంచి పుట్టిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అబద్దాలతో గద్దెనెక్కింది. ఈ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలను గుర్తు చేస్తూ ప్రజలకు వివరించాలి. రానున్న ఎన్నికల్లో బి ఎస్ ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ మళ్ళీ ఈశ్వర్ మీకు సేవ చేయడానికి ఎంపీ గా పోటీ చేయాలని అవకాశం ఇచ్చారు. ఈశ్వరన్న ఎమ్మెల్యేగా,మంత్రిగా ఉన్నప్పుడు కూడా మీ స్వంత కుటుంబ సభ్యుడిలాగానే ఉన్నడు, సాధ్యమైనంత వరకు ప్రజలకు ఏ కష్టం వచ్చినా వెన్నంటే ఉన్నడు అని కార్యకర్తలకు గుర్తుచేశారు. రేపటి రోజున ఈశ్వరన్న విజయానికి ప్రతి ఒక్కరు సహకరించాలని, పార్టీ చేసిన అభివృద్ధి ని ప్రజల్లోకి తీసుకెల్లి కారు గుర్తుకు ఓటు వేసి ఈశ్వర్ అన్నను గెలిపించాలని ప్రతి ఇంటికి వెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు జడ్పీటీసీ, ఎంపీపీ , వైస్ ఎంపీపీ ఎంపీటీసీ లు మాజీ సర్పంచులు వివిధ హోదాలో ఉన్న మండల నాయకులు యువకులు పార్టీ కార్యకర్త తదితరులు పాల్గొన్నారు.

# లేడీస్ తో అసభ్య ప్రవర్తన, నిందితుడికి రెండు రోజుల జైలు శిక్ష



**సికింద్రాబాద్ ఏప్రిల్ 24 (ప్రజామంటలు) :** మహిళలతో అసభ్యంగా ప్రవర్తించిన ఓ వ్యక్తికి రెండు రోజుల జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి జడ్జిమెంట్ ఇచ్చారు. చిలకలగూడ సీఐ అనుదీప్, ఎస్ఐ జ్ఞానేశ్వర్‌ల కథనం ప్రకారం.. మెట్టుగూడకు చెందిన పరశురామ్ (34) మంగళవారం రాత్రి బస్తీ లోని మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తుండగా స్థానికులు పోలీసులకు కంప్లెయింట్ చేశారు. దాంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని నిందితుడు పరశురామ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ%-%పెట్టీ కేసు నమోదు చేసి బుధవారం సికింద్రాబాద్ 15వ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చారు. సాక్ష్యాలను విచారించిన న్యాయమూర్తి రవిశంకర్ నిందితుడు పరశురామ్ కు రెండు రోజుల జైలు శిక్ష విధిస్తు ఉత్తర్వులు జారీ చేశారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు పరశురామ్‌ను చంచల్‌గూడ జైలుకు తరలించినట్లు చిలకలగూడ పోలీసులు తెలిపారు.

# ఇంటర్ ఫలితాల్లో 'కాకతీయ' విద్యార్థుల విజయ దుందుభి

పరీక్ష ఏదైనా విజేత 'కాకతీయ' నే

బైపీసీ విభాగంలో రాష్ట్రస్థాయిలో రెండవ ర్యాంకు

సీఈసీ విభాగంలో డివిజన్ మొదటి స్థానం

మండల కేంద్రంలో రాష్ట్రస్థాయి మార్కులు

తక్కువ ఫీజులు - ఎక్కువ మార్కులు

సాధారణ విద్యార్థుల తో అసాధారణ ఫలితాలు

విద్యార్థులను అభినందించిన కాకతీయ విద్యాసంస్థల అధినేత




**జమ్మికుంట ఏప్రిల్ 24 (ప్రజామంటలు):** తెలంగాణ ఇంటర్ బోర్డ్ బుధవారం విడుదల చేసిన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో కాకతీయ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయ దుందుభి మోగించినట్లు కాకతీయ విద్యాసంస్థల అధినేత, చైర్మన్ అవిర్నేని సుధాకర్ రావు పేర్కొన్నారు...ఈ మేరకు జమ్మికుంట పట్టణంలోని కాకతీయ జూనియర్ కళాశాల లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో విద్యార్థులను అభినందించారు...కళాశాలలో ప్రతిరోజు ప్రణాళికతో దిశానిర్దేశం చేయడం వలన, విద్యార్థుల నిరంతర సాధన వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు.. కాకతీయ కళాశాలలో తక్కువ ఫీజులు ఎక్కువ మార్కులు ఉంటాయని, ఇంటర్ లో ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ వహించి సాధారణ విద్యార్థులను సైతం కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా మార్కులు సాధించి మండల కేంద్రంలో రాష్ట్రస్థాయి మార్కులు సాధించడం పట్ల విద్యార్థులను అధ్యాపకులను అభినందించారు.. అనంతరం అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు స్వీట్ల పంపిణీ చేసి పుష్పగుచ్ఛం అందించారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులను ఆశీర్వదించారు.. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్ష ఫలితాలలో బైపిసి విభాగం నుండి సామ్రిన్ ముస్కాన్ 440 మార్కులకు గాను 437 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సాధించడం తో విద్యార్థినిని ప్రత్యేకంగా అభినందించారు. ఎంపీసీ విభాగం లో ఆఫ్రిన్ సుల్తానా 470 మార్కుల గాను 465 మార్కులతో మండల్ ఫస్ట్ గా నిలిచిందని, సీఈసీ విభాగంలో సిరిచందన 500 మార్కులకు 484 మార్కులు సాధించి హుజురాబాద్ డివిజన్ స్థాయిలో మొదటి స్థానం సాధించారని తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఫలితాలలో ఎంపీసీ విభాగంలో శ్రీవాణి దేవి 1000 మార్కులకు గాను 984 మార్కులు, బైపిసి విభాగంలో జైనాబ్ ఆఫ్రిన్ 1000 మార్కులకు గాను 989 మార్కులు, సీఈసీ విభాగంలో కోమల 1000 మార్కులకు గాను 947 మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జెగ్రిపోతుల రవిబాబు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## కరీంనగర్ కాంగ్రెస్ ఎం.పి. అభ్యర్థిగా ప్రవీణ్ రెడ్డి తరపున నామినేషన్ వేసిన అనుచరులు

### అధిష్ఠానం ప్రవీణ్ రెడ్డి కి టికెట్ కేటాయిస్తుందని కార్యకర్తల ఆశాభావం






**భీమదేవరపల్లి ఏప్రిల్ 24 (ప్రజామంటలు):** కరీంనగర్ కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థిగా అలిగి రెడ్డి ప్రవీణ్ రెడ్డి అనుచరులు బుధవారం కరీంనగర్ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ పమేల సత్పతికి నామినేషన్ పత్రాలు అందజేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు మంగ రామచంద్రం, బొజ్జపురి అశోక్ ముఖర్జీ, జోగిరెడ్డి, కేతిరి లక్ష్మారెడ్డి, భూపతి శ్రీకాంత్ ప్రవీణ్ రెడ్డి తరపున నామినేషన్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అధిష్టానం ఆదేశానుసారం పొన్నం ప్రభాకర్ కు హుస్నాబాద్ అసెంబ్లీ సీటును త్యాగం చేయడమే కాకుండా, ఆయన గెలుపులో ప్రధాన పాత్ర వహించడంతో పొన్నం ప్రభాకర్ రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆ సందర్భంగా అధిష్టానం పెద్దలు ప్రవీణ్ రెడ్డిని కరీంనగర్ పార్లమెంటు స్థానానికి పంపుతామని హామీ ఇవ్వడంతో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ కార్యకర్తలను ఏకం చేశారని అన్నారు. వివాద రహితుడు, సౌమ్యుడు, అభివృద్ధియే ప్రధాన లక్ష్యంతో పని చేసే అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డికే అధిష్ఠానం టికెట్ తో పాటు, బీఫామ్ అందజేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బి.ఎస్.పి కి రాజీనామా చేసిన తనుగుల ఎంపీటీసీ వాసాల నిరోషా రామస్వామి



**జమ్మికుంట ఏప్రిల్ 24 (ప్రజామంటలు):** బీఎస్పీ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పదవికి పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి బుధవారం రాజీనామా చేస్తున్నట్టు తనుగుల ఎంపీటీసీ వాసాల నిరోషా రామస్వామి తెలిపారు. తనతోపాటు జమ్మికుంట మండల అధ్యక్షులు పంజాల దిలీప్ గౌడ్, వీణవంక మండల అధ్యక్షులు కొంగల కుమార్ యాదవ్, ఇల్లందకుంట మండల అధ్యక్షులు మంద శివ శంకర్ మరియు మండల కమిటీ బాధ్యులందరూ రాజీనామా చేస్తు బిఎస్పీ పార్టీ రాష్ట్ర జిల్లా కమిటీకి యొక్క రాజీనామా లేఖలను పంపించడం జరిగిందని, ఈ రోజు నుంచి బీఎస్పీ పార్టీకి మాకు ఎలాంటి సంబంధమూ లేదు అని వాసాల రామస్వామి తెలిపారు..

## నేడు వెంకటేశ్వర స్వామి కళ్యాణ మండపంలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం



**ఇబ్రహీంపట్నం ఏప్రిల్ 24 (ప్రజామంటలు):** నేడు గురువారం కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు మరియు జువ్వాడి కృష్ణారావు ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం లోని శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణ మండపం లో జరిగే ముఖ్య కార్యకర్తల సమావేశనికి విచ్చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి తాటిపర్తి జీవన్ రెడ్డి, మరియు ధర్మపురి ఎమ్మెల్యే (ప్రభుత్వ విప్) అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విచేస్తున్నారు. కావున కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, రైతు నాయకులు, జువ్వడి అభిమానులు, మహిళా సోదరిమానులు పెద్ద ఎత్తున గురువారం అందరూ హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇబ్రహీంపట్నం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గూడ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.

## కోనాపూర్ జడ్.పి. హైస్కూల్ హెచ్.ఎం. పదవి విరమణ హాజరైన పిఆర్టియు నాయకులు





**కొడిమ్యాల్ ఏప్రిల్ 24 (ప్రజామంటలు):** ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో పి ఆర్ టి యు ముందంజలో ఉంటుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్ రావు అన్నారు. జగిత్యాల జిల్లా కొడిమ్యాల్ మండల కోనాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పైడిపల్లి సత్యనారాయణ రావు పదవి విరమణ సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సందర్భం లో వారు మాట్లాడుతూ.... ఉద్యోగ ఉపాధ్యాయుల మూడు సంవత్సరాల సర్వీస్ పెంపు పిఆర్టితోనే సాధ్యమైందని సిపిఎస్ రద్దుచేసి ఓపిఎస్ పునరుద్ధరించే వరకు పిఆర్టియు పోరాటం చేస్తుందని ఎన్నికల అనంతరం పండితుల అప్గ్రేడేషన్ కూడా పూర్తి అవుతుందని సర్వీస్ రూల్స్ సమస్య పరిష్కరించి ఎంఈఓ లు డైట్ లెక్చరర్స్ డిప్యూటీ ఈవో లు పదోన్నతులు కల్పించాలని 2010 ముందు నియామకమైన ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలని వారు కోరారు. ఈ సందర్భంగా వారు సత్యనారాయణ రావు సేవలను కొనియాడారు. సత్యనారాయణ రావు ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు యాళ్ల అమర్నాథ్. రెడ్డి బోయిని పెల్లి ఆనందరావు, కరీంనగర్ పిఆర్టియు అధ్యక్షులు ముస్కు తిరుపతిరెడ్డి, పెన్షనర్ సంఘం జిల్లా కార్యదర్శి కరబూజ రవీందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంతోష్, సభాధ్యక్షులుగా వ్యవహరించారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమేష్ వ్యాఖ్యాతగా, బొమ్మ సురేష్ వ్యవహరించారు. కార్యక్రమంలో జమీల్ శ్రీనివాసరెడ్డి, వేణుగోపాలరావు, ఏబీఎన్ రాజు, మహేష్, ప్రశాంత్ రెడ్డి, బొమ్మకంటి శ్రీనివాస్, గోవర్ధన్, ప్రసాద్, మల్ రెడ్డి రత్నాకర్, విజయ రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు, సత్యనారాయణ రావు బంధువులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## స్వీప్ ఆధ్వర్యంలో ట్రాన్స్ జెండర్స్‌కు ఓటు పై అవగాహన







**జగిత్యాల ఏప్రిల్ 24 (ప్రజామంటలు):** ఓటు వేయడం మన బాధ్యత– స్వీప్ ఆధ్వర్యంలో ట్రాన్స్ జెండర్ లకు ఓటరు అవగాహన కార్యక్రమంలో ఓటు వేయడం మనందరి బాధ్యత అని...అర్హత గల ప్రతి ఒక్కరూ రానున్న లోక్ సభ ఎన్నికల్లో తమ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకోవాలని జిల్లా స్వీప్ అధికారులు కోరారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారిణి షేక్ యాస్మిన్ బాషా ఆదేశాల మేరకు మున్సిపల్ 6వ వార్డులో బుధవారం స్వీప్ ఆధ్వర్యంలో జిల్లా మహిళా సంక్షేమశాఖ సహకారంతో ట్రాన్స్ జెండర్ లతో ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సంక్షేమశాఖ అధికారిణి శ్రీమతి వాణిశ్రీ, స్వీప్ అధికారులు ఎస్ సి కార్పొరేషన్ ఈ.డి. కె. లక్ష్మినారాయణ, జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారి చిత్రు, స్వీప్ జిల్లా కమిటీ సభ్యుడు సిరిసిల్ల శ్రీనివాస్ తో పాటు అంగన్ వాడి ఉద్యోగులు, బిఎల్వోలు, ఉమెన్ ఎంపవర్ మెంట్ ఉద్యోగులు మరియు జిల్లా ఎన్నికల ఐకాన్, ట్రాన్స్ జెండర్ నిహారిక, ట్రాన్స్ జెండర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డులో ఒక ర్యాలీ నిర్వహించిన అనంతరం వారు మాట్లాడుతూ..మే 13న జరగనున్న లోక్ సభ ఎన్నికల్లో అర్హత గల ప్రతి ఒక్కరు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.ఏదైనా సమస్యలు ఉన్నట్లయితే వెంటనే సివిజిల్ యాప్, ఓటర్ హెల్ప్ లైన్ యాప్ లను వినియోగించుకోవచ్చని అన్నారు. కాగా, అంతకుముందు సమావేశంలో ట్రాన్స్ జెండర్లు తమ జీవనోపాధి, వారు ఎదుర్కొంటున్న సమస్యలపై జిల్లా అధికార యంత్రాంగం దృష్టి పెట్టి పరిష్కరించి, తమకు ఉపాధి కల్పించాలని కోరారు.



## రైతులు ప్రతి ఒక్కరూ సేంద్రియ వ్యవసాయానికి అలవాటు పడాలి

### జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

**రాయికల్ ఏప్రిల్ 24 (ప్రజామంటలు):** రైతులు ప్రతి ఒక్కరూ సేంద్రియ వ్యవసాయానికి అలవాటు పడాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామంలో రైతు ఉత్తిదారుల కంపెనీ లిమిటెడ్ ఆఫీస్ ను జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ప్రతి ఒక్కరూ సేంద్రియ వ్యవసాయానికి అలవాటు పడాలని ప్రతి రైతు కూరగాయలు మార్కెట్ కి వెళ్లి కొనుక్కోకుండా రైతులు స్వయంగా పండించు కోవాలని సూచించారు. సంఘంలోని డైరెక్టర్లు మంచి పంటలు పండించి ఇతర రైతులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. రైతు ఉత్పత్తి దారుల సంఘాన్ని అభివృద్ధి బాటలో నిలపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వాణి, రాయికల్ మండల తహసిల్దార్ అబ్దుల్ ఖయ్యూం, రెవెన్యూ ఇన్స్పెక్టర్ పద్మయ్య, పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం దత్తత అల్లీపూర్ దత్తత గ్రామ ఇంచార్జ్ డాక్టర్ డి ఏ రజినీ దేవి, నాబార్డ్ అధికారులు, అల్లీపూర్ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ జయంతి, రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు అత్తినేని శంకర్, డైరెక్టర్లు, అల్లీపూర్ చుట్టుపక్కల గ్రామాల రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## మంత్రి పొన్నం కుటుంబ సభ్యుల వివాహానికి హాజరైన జమ్మికుంట కాంగ్రెస్ నాయకులు

**జమ్మికుంట ఏప్రిల్ 24 (ప్రజామంటలు):** హైదరాబాద్ పట్టణంలోని ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్ లో బుధవారం తెలంగాణ రాష్ట్ర బిసి సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ సోదరుడు పొన్నం రవి చంద్ర తనయుడు పొన్నం రాజీవ్ చంద్ర – అమ్రిత వివాహ వేడుకలకు హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు పుల్లూరు సదానందం, పూదరి రేణుక– శివకుమార్ గౌడ్ హాజరై నూతన వదువరులను ఆశీర్వదించారు.

## నిరుద్యోగ నిరుపేద మధ్యతరగతి కుటుంబాల కోసం రైతన్నల తలరాతలు మార్చే దిశగా

### పార్లమెంట్ ఎన్నికలలో " స్వతంత్ర అభ్యర్థిగా మానస రెడ్డి"




**సైదాపూర్ ఏప్రిల్ 23 (ప్రజామంటలు):** కరీంనగర్ జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం హనుమాన్ విజయోత్సవం సందర్భంగా సైదాపూర్ మండల్ బొమ్మకల్ గ్రామానికి చెందిన పేరాల మానస రెడ్డి నామినేషన్ వేళ తన మనసులో మాటను ప్రజా మంటలు దినపత్రిక తో పంచుకున్నారు. కరీంనగర్ పార్లిమెంట్ నియోజకవర్గ ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ.... ఆనాడు శ్రీ రామునికి తోడుగా ఆంజనేయుడు ఉండి ఎలా ఐతే ధర్మా యుద్ధాన్ని గెలిపించాడో అలాగే నాకు తోడుగా ఉండి నా ఈ ధర్మా యుద్ధాన్ని కూడా గెలిపిస్తాడని ఆశీస్తూ కరీంనగర్ పార్లిమెంట్ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థిగా ఆ శ్రీ రాముని ఆశీస్సులు, ప్రజల అందరి ఆశీస్సులతో మరియు నా నిరుద్యోగ యువత మరియు నా రైతు అన్నలు, నిరుపేద మధ్యతరగతి కుటుంబాలు, సన్నిహితులు ఇచ్చినటువంటి ఒక్కొక్క రూపాయిని నా పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ రుసుముగా 25,000 రూపాయలను నాణేల రూపంలో చెల్లించటం జరిగింది. నాకు తోడుగా అండగా నిలిచిన అందరికీ మానస రెడ్డి కృత్ఞతలు తెలియజేశారు.

SRAVANTHI JR COLLEGE



### ఇంటర్ ఫలితల్లో స్రవంతి కళాశాల

## విద్యార్థుల ప్రభంజనం

**జమ్మికుంట ఏప్రిల్ 24 (ప్రజామంటలు) :** నిన్న ప్రకటించిన ఇంటర్మీడియట్ ఫలితల్లో జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని స్రవంతి కళాశాల విద్యార్థులు ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను 463మార్కులు రావుల అనుదీప్, అలాగే సీఈసీ విభాగం లో 500మార్కులకు గాను 464మార్కులు మోటపోతుల శ్రీజన్ సాధించినట్లు కళాశాల చైర్మన్ డా. పుల్లూరి సంపత్ రావు తెలిపారు. వీరితో పాటు 64% ఉతిర్ణత సాధించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ నడిపెల్లి శ్రీనివాస్ రావు తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం పుష్ప గుచ్చాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు రహమాన్, కొండ విజయ్, రాజేందర్, చందు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఎంపీసీ ద్వితీయ సంవత్సరం టాపర్ గా కేజీబీవీ విద్యార్థిని 'శ్రీవల్లి'


### అభినందించిన స్పెషల్ ఆఫీసర్ జ్యోతి



**భీమదేవరపల్లి ఏప్రిల్ 24 (ప్రజామంటలు):** నిరుపేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన ఎందరో విద్యార్థులకు ఆధారం భీమదేవరపల్లి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం. ఎన్నో సమస్యలతో, అరకొర మౌలిక సదుపాయాలతో ఇబ్బందులు పడుతున్నప్పటికీ చదువు విషయంలో అగ్ర భాగంలో నిలుస్తుంది. బుధవారం ప్రకటించిన ఇంటర్ ఫలితాలలో కేజీబీవీ విద్యార్థిని 'శ్రీవల్లి' ఎంపీసీ విభాగంలో 964/1000 మార్కులతో జిల్లా స్థాయి మార్కులను సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా కళాశాల స్పెషల్ ఆఫీసర్ పిట్టల జ్యోతి ఇంటర్ ఫలితాలను వెల్లడించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో జె. స్వాతి 449/470, జి. శ్రీజ 432/470, బైపీసీ విభాగంలో సౌజన్య 423/440 నవ్య 413/440, ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో సిహెచ్. శ్రీవల్లి 964/1000, కావ్య 932/1000, ఉషారాణి 933/1000, బైపీసీ విభాగంలో కీర్తన 948/1000, శ్రీజ 916/1000 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అధ్యాపక బృందం అభినందించి సంతోషం వ్యక్తపరిచారు.

## పెద్దమ్మ తల్లికి ఓడి బియ్యం సమర్పించిన జెడ్పి చైర్ పర్సన్ దావ వసంత

**జగిత్యాల ఏప్రిల్ 24 (ప్రజామంటలు):** రూరల్ మండల హన్మాజీపేట్ గ్రామంలోనీ శ్రీశ్రీశ్రీ ఆది పెద్దమ్మ తల్లి జాతరలో పాల్గొని అమ్మవారికి ఓడిబియ్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించిన జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్. పెద్దమ్మ తల్లి దీవెనలతో జిల్లా ప్రజలందరికీ మంచి జరగాలని ప్రజలందరు అష్ట ఐశ్వర్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దామోదర్, మాజి ఉప సర్పంచ్ రాజనర్సయ్య, గ్రామశాఖ అధ్యక్షుడు నరేష్, నాయకులు గంగా రెడ్డి, హరీష్, రాజలింగు, శేఖర్, జగన్ తదితరులు పాల్గొన్నారు.



## ఇంటర్ ద్వితీయ, ప్రథమ సంవత్సర పరీక్షా ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన ఇబ్రహీంపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు



**ఇబ్రహీంపట్నం ఏప్రిల్ 24 (ప్రజామంటలు):** బుధవారం విడుదల చేసినటువంటి ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో ఇబ్రహీంపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాల కు చెందిన విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి విజయదుందుబిని మోగించారు. ఎంపిసి. ద్వితీయ సంవత్సరంలో పి. అనన్య 970/1000 ప్రథమ స్థానం ద్వితీయ స్థానంలో ఏ. రుషిక 961/1000 బైపిసి ద్వితీయ సంవత్సరంలో డి. చందన 945/1000 ప్రథమ స్థానంలో ఎస్. హారిక 937/1000 ద్వితీయ స్థానం సాధించగా సిఈసి ద్వితీయ సంవత్సరంలో ప్రథమ స్థానంలో టి. శ్రీయ 911/1000, ద్వితీయ స్థానంలో బి. నికిత 876/1000, హెచ్ఈసి ద్వితీయ సంవత్సరంలో ఎండీ ఇర్ఫాన్ 874/1000 ప్రథమ స్థానం సాధించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో...ఎంపిసి. లో ఏ. సౌజన్య 453/470 ప్రథమ స్థానం సాధించగా ఏ. రజిత 445/470, ద్వితీయ స్థానంలో, బైపిసి లో పి. సింధు 423/440 ప్రథమ స్థానం సాధించగా ద్వితీయ స్థానంలో ఎస్.. ధరణి 380/440, సిఈసి ప్రథమ స్థానంలో టి. గంగోత్రి 421 /500 ప్రథమ స్థానం సాధించగా ద్వితీయ స్థానంలో టి. వర్షిని 362/500, హెచ్ఈసి ప్రథమ సంవత్సరంలో %దీ%. వరుణ్ 340/500 మార్కులు సాధించి ఉత్తమ ఫలితాలను అందించారు. మంచి మార్కులు సాధించి విజయ దుందుభిని మోగించిన విద్యార్థిని విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ఏ. సంజీవ్ మరియు అధ్యాపకులు అభినందించారు.

# కేంద్రం సాయం అందించినా అభివృద్ధి శూన్యం

## పోలవరం కూడా పూర్తి చేయలేని జగన్ సర్కార్

## మత ఆధారిత గణనతో సాయుధ బలగాల్లో చిచ్చు

## కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ విమర్శలు



**విశాఖపట్నం,ఏప్రిల్24 (ప్రజా మంటలు):** ఏపీ అభివృద్ధికి అన్ని రకాలుగా కేంద్రం సహకరిస్తుంటే ఇక్కడ అధికారంలో ఉన్న వైకాపా ప్రభుత్వం మాత్రం లెక్కకు మించి అప్పులు చేసిందని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ విమర్శించారు. అప్పుల కారణంగా అబివృద్ది నిలిచిపోయిందన్నారు. విశాఖలో మేధావులతో జరిగిన సమావేశంలో ఎన్డీయే కూటమి ఎంపీ అభ్యర్థి భరత్, ఎమ్మెల్యే అభ్యర్థి విష్ణుకుమార్ రాజులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కూడా వైకాపా ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడం దురదృష్టకరమన్నారు. వైకాపా ప్రభుత్వం మొత్తం రూ. 13.50లక్షల కోట్ల అప్పులు చేసి.. రాష్ట్రంలోని ప్రతి వ్యక్తిపై రూ.2లక్షల రుణభారం మోపింది. ఖాజానా ఖాళీ చేసి పన్నుల భారం ప్రజల మీద వేసింది. రాష్ట్రాన్ని, విశాఖను డ్రగ్స్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌గా మార్చిందని మండిపడ్డారు. ల్యాండ్, హ్యూమన్ ట్రాఫికింగ్, మైనింగ్ మాఫియాలు రాష్ట్రంలో స్వైర విహారం చేస్తున్నాయి. జగన్ ప్రభుత్వం అవినీతి ఆరోపణలతో పూర్తిగా కూరుకుపోయింది. ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తే రాష్ట్రంలో అభివృద్ధికి భరోసా కల్పిస్తుంది. కాంగ్రెస్ విస్మరించిన తెలుగు బిడ్డ పీవీ నరసింహారావుకు భారతరత్న ఇచ్చి తెలుగువారిపై ఉన్న గౌరవాన్ని ఎన్డీయే ప్రభుత్వం చాటి చెప్పింది. వచ్చే ఐదేళ్లలో దేశంలో జమిలి ఎన్నికలకు పూర్తిస్థాయిలో చర్యలు చేపడతాంఅని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ఇకపోతే కాంగ్రెస్ ఐడియాగా చెబుతున్న 'సంపద పునఃపంపిణీ' వివాదం వేడెక్కుతున్న తరుణంలో ఆ పార్టీపై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మరో బాంబు వేశారు. 'మతఆధారిత జనగణన'కు సిఫారసు చేయడం ద్వారా దేశ సాయుధ బలగాల్లో చీలికకు కేంద్రంలోని గత కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రయత్నించాయని విశాఖపట్నంలో బుధవారంనాడు జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచార్ కమిటీ సాయుధ బలగాల్లో మత ఆధారిత జనగణనకు 2006లో సిఫారసు చేసింది. తాజా లోక్‌సభ ఎన్నికల్లో గెలిస్తే మతపరంగా మైనారిటీలకు రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో సంకేతాలిచ్చింది. రెలిజియస్ మైనారిటీలకు రిజర్వేషన్లు ప్రవేశపెట్టి, సాయుధ బలగాల్లో మతఆధారిత కులగణన కూడా చేపడితే దేశ ఐక్యత, సమగ్రతకు ఎంతమాత్రం మంచిది కాదని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. మైనారిటీల సంక్షేమం పేరుతో కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ తనకు సమార్ కమిటీ నివేదికను గుర్తుతెచ్చి ఆవేదనను కలిగించిందని అన్నారు. కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలను రాజ్‌నాథ్ సింగ్ తప్పుపడుతూ, దొడ్డిదారిన మతఆధారిత రిజర్వేషన్లు తెచ్చేందుకు ఆ పార్టీ ప్రయత్నిస్తోందని అన్నారు. ఇది కాంగ్రెస్ పార్టీ నిజస్వరూపాన్ని బహిర్గతం చేస్తోందని చెప్పారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో చేసిన వాగ్దానాలు సమాజాన్ని విడగొట్టేలా ఉన్నాయని ఆరోపించారు. ఇదే పార్టీ మతం పేరుతో దేశాన్ని విభజించిందని, అసలు బుజ్జగింపు రాజకీయాలనేవి ఆ పార్టీ డీఎన్ఏలోనే ఉన్నాయని రాజ్‌నాథ్ ధ్వజమెత్తారు. గతంలోని అవిభక్త ఆంధ్రప్రదేశ్ లో పాలన సాగించిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగాలలో ముస్లింలకు రిజర్వేషన్లు ఇవ్వడం ద్వారా 'కమ్యూనిటీ లేబొరేటరీ'ని ఏర్పాటు చేసిందని ఆయన విమర్శించారు. 2004 నుంచి 2014 వరకూ కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం రిజర్వేషన్ కోసం ఐదుసార్లు ప్రయత్నాలు చేసిందని, అయితా వారి ఎజెండా ముందుకు సాగకుండా సుప్రీంకోర్టు, ఈ దేశంలోని చట్టాలు నిలువరించాయని రాజ్‌నాథ్ సింగ్ వివరించారు.

# నేటితో ముగియనున్న నామినేషన్ల ఘట్టం

## జోరుగా నామినేషన్ల దాఖలు – ఉధృతంగా ప్రచార హోరు

**విజయవాడ,ఏప్రిల్ 24 (ప్రజా మంటలు):** సాధారణ ఎన్నికల్లో కీలకమైన నామినేషన్‌ల దాఖలు ఘట్టం గురువారంతో ముగియనుంది. ఈనెల 18నుంచి పక్రియ ప్రారంభమైంది. ఆదివారం మినహా మిగిలిన ఐదు రోజులు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. చివరి రెండు రోజులైన బుధ, గురువారాల్లో పెద్దసంఖ్యలో దాఖలు కానున్నాయి. వైసిపి, టీడీపీ,జనసేన, బిజెపి అభ్యర్థులు ఇప్పటికే భారీ ర్యాలీలు, సభలతో నామినేషన్లు వేశారు. చివరి రోజు కావడంతో కొందరు గురువారం నామినేషన్‌ల కార్యక్రమం నిర్వహించనున్నారు. మంగళవారం నాడు జనసేనాని పవన్ కళ్యాణ్‌అట్టహాసంగా నామినేషన్లు దాఖలు చేశారు. ఈ సందర్భంగా కూటమి పార్టీల కార్యకర్తలు, నాయకులతో భారీ ర్యాలీలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రచారం ముమ్మరంనామినేషన్‌ల దాఖలు ఘట్టం ముగింపు దశకు చేరుకోవడంతో ఆయా పార్టీలఅభ్యర్థులు ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. మరోవైపు వైసీపీ నుంచి పార్టీలోకి వచ్చే వారిని చేర్చుకోవడాన్ని ఉధృతం చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఊరూరా పర్యటిస్తున్నారు. నామినేషన్‌ల ర్యాలీ, సభల ఏర్పా ట్లు చేసుకొంటూనే మరోవైపు పార్టీలో చేరేవారిని స్వాగ తించి చేర్చుకోవడంలో బిజీగా ఉన్నారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ టీడీపీలోకి భారీగా వైసీపీ నుంచి నాయకులు, కార్యకర్తలు చేరుతున్నారు. నిత్యం ప్రతి నియోజకవర్గంలో మండల స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు వైసీపీలో క్రియాశీలకంగా పనిచేసే అనేకమంది వచ్చి సైకిలెక్కుతుండటంతో ఇటు టీడీపీ అభ్యర్థులు, అటు కేడర్‌లో ఉత్సాహం కనిపిస్తోంది.

# వైకాపా ప్రలోభాలకు దూరంగా ఉండండి

## ప్రచారంలో పురందేశ్వరి పిలుపు



**రాజమండ్రి,ఏప్రిల్24(ప్రజా మంటలు):** అధికార పార్టీ ప్రలోభాలకు ప్రజలు దూరంగా ఉండాలని ఏపీ బీజేపీ చీఫ్ దగ్గుబాటి పురందేశ్వరి కోరారు. బుధవారం గోపాలపురం మండలంలో విస్తృతస్థాయిలో ప్రచారం చేస్తున్న బీజేపీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ అభ్యర్థి పూరందేశ్వరికి తెలుగు మహిళలు హారతులు పట్టారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ.. ఐదు సంవత్సరాలు నియోజవర్గంలో చేసిన అభివృద్ధి ఏమీ లేదని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అక్రమ సంపాదనపై దృష్టి తప్ప, అభివృద్ధిపై దృష్టి పెట్టలేదని ఆగ్రహించారు. దళిత యువకులకు మృతికి కారణమైన హోం మంత్రి వనితను ప్రజల తిప్పికొట్టాలన్నారు. ప్లెక్సీల విషయంలో దళిత యువకుడు బలవన్మరణానికి హోంమంత్రి కారణ మయ్యారని మండిపడ్డారు. కేంద్రంలో రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. గోపాలపురం నియోజవర్గ పరిధిలో ఎన్నో ఏళ్లుగా ఉన్న స్మశాన భూముల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రాజమండ్రి పార్లమెంటు పరిధిలో ఉన్న ఎన్డీఏ కూటమి ఎంపీ ఎమ్మెల్యే అభ్యర్థులు అందరిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. వైసీపీ నాయకుల ప్రలోభాలకు, బెదిరింపులకు ప్రజలు లొంగవద్దన్నారు. మే 13న స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించు కోవాలని పురందేశ్వరి వినతి చేశారు. కాగా.. పురందేశ్వరితో పాటు గోపాలపురం నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి వెంకటరాజు కూడా జిల్లా విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రచార కార్యక్రమంలో భారీగా కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రతిపక్షాలను వేధించడమే లక్ష్యం

## పోలీస్ రాజ్యం నడిపిన జగన్

## టీడీపీ నేత బోండా ఉమా విమర్శలు

**విజయవాడ,ఏప్రిల్24 (ప్రజా మంటలు):** రాష్ట్రంలో ఐదేళ్లు పోలీసు వ్యవస్థను అడ్డం పెట్టుకుని ప్రతిపక్ష పార్టీలు నేతలు, కార్యకర్తలను ఇబ్బందులు పెట్టారని టీడీపీ నేత బోండా ఉమా విమర్శించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు పవన్ కళ్యాణ్ వంటి నాయకులను పోలీసులు వేధించారన్నారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చాక, నామినేషన్‌లు వేశాక కూడా పోలీసులు అరాచకాలు ఆగలేదన్నారు. తాడేపల్లి ప్యాలెస్ ఒత్తిడితో కొంతమంది పోలీసులు టీడీపీ అభ్యర్థులపై అనేక కేసులు పెట్టారన్నారు. తప్పుడు కేసులు పెట్టారనేందుకు తానే ఉదాహరణ అని చెప్పుకొచ్చారు. సీఎం పరిధిలో పోలీసులు లేరనే విషయం కూడా తెలియదా అని ప్రశ్నించారు. ఎన్నికల సంఘం ఆదేశాలతో పోలీసులు పనిచేయాలన్నారు. సజ్జల, మరో గొట్టంగాడు చెప్పాడని తమపై అక్రమ కేసులా అంటూ విరుచుకుపడ్డారు. నిన్న ఇద్దరు పోలీసు ఉన్నతాధికారులపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకుందన్నారు. పోటీ చేసే అభ్యర్థులకు ఎన్నికల నియమావళి వర్తిస్తుందని తెలిపారు. వైసీపీ కండువా కప్పుకుని పనిచేసే పోలీసులపై ఫిర్యాదు చేస్తామని.. చట్టానికి, నిబంధనలకు విరుద్ధంగా పని చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నార్త్ ఏసీపీ డి.యన్.ఎ ప్రసాద్, సీఐ దుర్గా ప్రసాద్‌లు వైసీపీకి అనుకూలంగా పని చేస్తున్నారని ఆరోపించారు. 'వెల్లంపల్లి పోస్టులు వేపించారని స్వామి భక్తి చూపుతున్నారు. మమ్మల్ని అన్యాయంగా ఇబ్బందులు పెడుతున్నారు. మా వాళ్లు ఎక్కడైనా కనిపిస్తే తప్పుడు కేసులు పెడుతున్నారు. పోటీలో ఉన్న నేను ప్రచారానికి అనుమతి ఇవ్వాలని అర్జీ పెట్టాం. ఏసీపీ, సీఐలు అనుమతి రిజక్ట్ చేస్తున్నట్లు ఆర్‌ఓకి చెప్పారు. నేను స్వేచ్ఛగా ప్రచారం చేసుకునే వీలు లేకుండా చేశారు. అడిగితే పనికిమాలిన కారణాలు, ఆంక్షలు పెడుతున్నారు. ఏ సమయంలో ఏ వీధిలో ఎవరి ఇంటి ముందు ఉంటారో సమయం చెప్పాలంట. ఎన్నికల ప్రచారంలో చెప్పిన సమయం ప్రకారం ప్రచారం నడుస్తుందా? నా రాజకీయ జీవితం లో ఇటువంటి నిబంధన ఎప్పుడూ చూడలేదయ, వినలేదు. దేశం మొత్తం లో కూడా పోటీ చేసే అభ్యర్థిగా రాత్రి తొమ్మిది వరకు ప్రచారం చేసుకోవచ్చు. నాకు పోలీసు పర్మిషన్ లేదని నా ప్రచారం ఆపడం దుర్మార్గం కాదా? వెల్లంపల్లికి ఈ నిబంధనలు వర్తించవా? సమయం వారికి పట్టదా?. ఇప్పటికే ఈ ఏసీపీ, సీఐలపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాం. ఈరోజు కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని కలిసి మరోసారి ఆధారాలతో ఫిర్యాదు చేస్తున్నాం అని బోండా ఉమా వెల్లడించారు.

# వైఎస్‌ను తిట్టిన బొత్స పితృసమానులా

**జగన్‌కు ఉరిశిక్ష వేయాలన్న బొత్స మాటలు మరిచారా**

**ఇప్పుడు కేబినేట్‌లో ఉన్న వారంతా వ్యతిరేకులే**

**హామీలను అమలు చేయకుండా మభ్య పెట్టిన జగన్**

**రేపల్లె సభలో జగన్‌పై షర్మిల ఘాటు విమర్శలు**



**గుంటూరు,ఏప్రిల్24 (ప్రజా మంటలు):** వైఎస్ రాజశేఖర్ రెడ్డిని, విజయమ్మను గతంలో తిట్టిన బొత్స సత్యనారాయణ ఇప్పుడు తండ్రి సమానులని జగన్ అనడంపై షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వార్త పేపర్లో చూశాక తనకు బాధ కలిగిందన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని రేప్లలె నియోజకవర్గంలో ఎన్నికల ప్రచరాసభ నిర్వహించారు. ఈ సభలో జగన్ పై విమర్శలు గుప్పించారు. విజయనగరంలో నిర్వహించిన బస్సుయాత్ర సభలో జగన్ బొత్సను ఓటర్లకు పరిచయం చేస్తూ.. తన తండ్రి లాంటి వాడన్నారు. గతంలో కాంగ్రెస్‌లో ఉన్న బొత్స సత్యనారాయణ జగన్ తో పాటు విజయమ్మ, వైఎస్ రాజశేఖర్ రెడ్డిని కూడా విమర్శించారు. తర్వాత వైసీపీలో చేరారు. ఆ మాటల్ని ఇప్పుడు గుర్తు చేసిన షర్మిల జగన్ పై విమర్శలు గుప్పించారు. ఇదే బొత్స సత్యనారాయణ రాజశేఖర్ రెడ్డిని తాగుబోతు అని తిట్టారు.. ఇదే బొత్స సత్యనారాయణ జగన్మోహన్ రెడ్డికి ఉరి శిక్ష వేయాలని కూడా అన్నారు. ఆఖరికి వైఎస్ రాజశేఖర్ రెడ్డి భార్య విజయమ్మను కూడా బొత్స అనేక మాటలు అన్నారన్నారు. అలాంటి బొత్స . . ఇప్పుడు జగన్మోహన్ రెడ్డికి నాన్నలాంటి వారయ్యారని మండిపడ్డారు. ఒక్క బొత్స మాత్రమే కాదని ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి మంత్రి వర్గంలో వైఎస్ఆర్ ను అభిమానించే వారే లేరన్నారు. వైఎస్ పై అభిమానం ఉన్న వాళ్లు.. ఆయనను గౌరవించేవారు కేబినెట్ లో లేరన్నారు. మంత్రులు అందరూ రాజశేఖర్ రెడ్డిని తిట్టిన వాళ్లేనన్నారు. వైఎస్ ను తిట్టిన వాళ్లే మంత్రులుగా ఉన్నారన్నారు. జగన్ కోసం పని చేసిన వాళు ఆయనకు ఏమీ కారని.. కానీ బొత్స లాంటి వాళ్లు మాత్రం తండి సమానులయ్యారని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ కోసం మూడు వేల కిలోమీటర్ల పాదయాత్ర చేసిన వారు.. గొడ్డలి పోట్లకు గురైన వారు ఆయనకు ఏమీ కావడం లేదన్నారు. అసలు వైఎస్ఆర్ అనే పేరులోనే వైఎస్ఆర్ లేడన్నారు. వై అంటే సుబ్బారెడ్డి, ఎస్ అంటే సాయిరెడ్డి, ఆర్ అంటే సజ్జల రామకృష్ణారెడ్డి అని గుర్తు చేశారు. మరి వైఎస్ఆర్‌లో వైఎస్ఆర్ ఎక్కడున్నారని ప్రశ్నించారు. వైఎస్సార్‌ను తిట్టిన వాళ్ళకే జగన్ పెద్దపీట వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీళ్ళందరూ తండ్రులు,అక్కలు,చెల్లెల్లు అంటూ సెటైర్ విసిరారు. నిజంగా ఆయన కోసం పని చేసిన వాళ్ళు ఈయనకు ఏమీకారన్నారు. ఆయన కోసం పాదయాత్రలు చేసిన వాళ్ళు ఏమీకారని చెప్పుకొచ్చారు. వైఎస్సార్ కోసం పని చేసి గొడ్డలి పోటుకు గురైన వాళ్ళు ఏమి కారని తెలిపారు. జగన్ గారు ఇక్కడకు వచ్చారట. హామీలు ఇచ్చారట. చెక్ డ్యాంలు కట్టి లక్ష ఎకరాలకు సాగునీరు ఇస్తామన్నారట. 100 పడకల ఆసుపత్రి అన్నారట. అక్వా రైతుల కోసం ఆక్వా పార్క్ అన్నాడు. ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇస్తామని చెప్పారట. షిప్పింగ్ హార్బర్ కడతాం అన్నాడు. ఇచ్చిన ఒక్క హామీ నెరవేర్చలేదు' అంటూ వైఎస్ షర్మిలా రెడ్డి విమర్శలు గుప్పించారు.

# పాయకరావు పేటలో పాగా వేసేదెవరో
# అనితకు సెంటిమెంట్ కలసి వచ్చేనా?



**అనకాపల్లి, ఏప్రిల్ 24 (ప్రజా మంటలు):** అనకాపల్లి జిల్లా పాయకరావు పేట బరిలో దిగిన తెలుగు మహిళ అధ్యక్షురాలు వంగలపూడి అనిత తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఇక్కడి నుంచి ఒకసారి గెలిచిన వారు మళ్లీ గెలవరన్న సెంటిమెంట్ ఉంది. దీంతో అనిత గెలుస్తుందా లేదా అన్న చర్చ మొదలయ్యింది. ఈ ఎన్నికల్లో వైసీపీ తరపున కంబాల జోగులు బరిలో ఉండగా.. కూటమి తరపున వంగలపూడి అనిత పోటీ చేస్తున్నారు. ఆమె చరిత్ర తిరగరాస్తారా అన్నది చూడాలి. కాగా.. అనిత 2014 ఎన్నికల్లో ఇక్కడ్నుంచి 2,828 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఇక జోగులు ఈ నియోజకవర్గం నుంచి ఒక్కసారి పోటీ చేయలేదు.. ఇదే తొలిసారి. అయితే.. 2004లో పాలకొండ, 2014 ఎన్నికల్లో రాజాం నుంచి, 2019లో కూడా రాజాం నుంచి పోటీచేసి మొత్తం మూడుసార్లు అసెంబ్లీలోకి అడుగుపెట్టారు. ఈ ఎన్నికల్లో పాయకరావుపేటకు వైసీపీ హైకమాండ్ ట్రాన్స్‌ఫర్ చేసింది. దీంతో సీనియర్ ఎమ్మెల్యేగా ఉన్న జోగులు గెలుస్తారా..? లేకుంటే ఇదివరకే ఒకసారి గెలిచిన అనిత గెలుస్తారా..? అనేది చూడాలి. అయితే.. ఒక్కసారి ఓడితే.. మళ్లీ గెలవడం కష్టమేనన్న హడావుడితో అటు వైసీపీలో.. ఇటు కూటమిలోనూ టెన్షన్ మొదలైంది. పాయకరావుపేట నియోజకవర్గంలో పోటీ చేసినవారు ఒకసారి ఓడిపోతే ఇక అంతే సంగతులన్న ప్రచారం ఉంది. రెండోమారు మళ్లీ గెలిచిన సందర్భాలు లేవు. గంటెల సుమన, చెంగల వెంకట్రావు, కాకర నూకరాజు పాయకరావుపేట నుంచి పలుమార్లు పోటీ చేశారు. అయితే ముగ్గురూ ఒకసారి ఓడిపోయిన తరువాత ఎన్నిసార్లు పోటీ చేసినా తిరిగి గెలవలేదు. 1983 ఎన్నికల్లో టీడీపీ తరపున తొలిసారిగా గెలుపొందిన గంటెల సుమన ఆ తరువాత నాదెండ్ల భాస్కరరావుకు మద్దతు తెలిపి టీడీపీకి దూరమయ్యారు. అనంతరం 1985లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా కాకర నూకరాజు మొదటిసారి పోటీ చేసి గెలుపొందారు. ఆ తరువాత 1989, 1994 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన కాకర నూకరాజుకి ప్రత్యర్థిగా, అదేవిధంగా 1999లో టీడీపీ తరపున తొలిసారిగా పోటీ చేసిన చెంగల వెంకట్రావుకు ప్రత్యర్థిగా కాంగ్రెస్ (అనీనిణస!బబ) తరపున గంటెల సుమన పోటీ చేసి...ఆ మూడు ఎన్నికల్లోనూ వరుసగా ఓటమి పాలయ్యారు. 1999 ఎన్నికల్లో అన్న తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసిన కాకర నూకరాజు మూడో స్థానంలో నిలిచారు. అదేవిధంగా 2004లో టీడీపీ తరపున చెంగల వెంకట్రావు రెండోసారి పోటీ చేయగా.. కాంగ్రెస్ తరపున పోటీ చేసిన ఎ.విజయ రావుతో పాటు ఇండిపెండెంట్‌గా పోటీలో నిలుచున్న గంటెల సుమన ఓటమిపాలయ్యారు. 2009లో టీడీపీ తరపున మూడోసారి బరిలోకి దిగిన చెంగల వెంకట్రావు కాంగ్రెస్ అభ్యర్థి గొల్ల బాబూరావు చేతిలో ఓటమి చెందారు. ఆ తరువాత 2012 ఉప ఎన్నికలో వైసీపీ తరపున పోటీ చేసిన గొల్ల బాబూరావు విజయం సాధించగా టీడీపీ టికెట్టుపై పోటీచేసిన చెంగల వెంకట్రావు, కాంగ్రెస్ తరపున పోటీ చేసిన గంటెల సుమన ఓటమిపాలయ్యారు. ఆ తరువాత 2014లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ తరపున పోటీచేసిన చెంగల వెంకట్రావు ఓటమి చెందారు. ఇక 2019లో బీజేపీ టికెట్‌పై పోటీ చేసిన కాకర నూకరాజు నోటా కంటే తక్కువ ఓట్లు సాధించి ఓడిపోయారు. ఇలా గంటెల సుమన ఒకసారి ఎన్నికల్లో ఓడిన తరువాత ఐదుసార్లు పోటీచేసినా గెలవలేకపోయారు. అదేవిధంగా చెంగల వెంకట్రావు, కాకర నూకరాజు ఒక సారి ఓటమిపాలైన తరువాత రెండు పర్యాయాలు పోటీ చేసినా గెలవలేదు.

# ఎపి ఇంటిలిజెన్ చీఫ్‌గా కుమార్ విశ్వజిత్

## విజయవాడ సీపీగా పీహెచ్‌డీ రామకృష్ణ – ఎన్నికల సంఘం ఆదేశాలతో నియామకం

**విజయవాడ,ఏప్రిల్24 (ప్రజా మంటలు):** ఏపీ ఇంటెలిజెన్స్ డీజీపీ, విజయవాడ పోలీస్ కమిషనర్ పోస్టుల్లో కేంద్ర ఎన్నికల సంఘం కొత్త వారిని నియమించింది. ఇంటెలిజెన్స్ చీఫ్ గా కుమార్ విశ్వజీత్, విజయవాడ సీపీగా పీహెచ్‌డీ రామక్రిష్ణలను నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. వీరు గురువారం ఉదయం 11 గంటలకల్లా ఈ బాధ్యతలు తీసుకోవాలని ఎన్నికల సంఘం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ రెండు స్థానాల్లో ఇంతకుముందు వరకు ఉన్న అధికారులు ఎన్నికల కోడ్ ను ఉల్లంఘిస్తున్నారన్న ఆరోపణలపై సీఈసీ ట్రాన్స్ ఫర్ చేసిన సంగతి తెలిసిందే. ఇంతకుముందు విజయవాడ సీపీగా కాంతి రాణా, ఇంటెలిజెన్స్ చీఫ్ గా పీఎస్ఆర్ ఆంజనేయులు ఉన్నారు. వారు అధికార పార్టీకి పక్షపాతంగా వ్యవహరిస్తున్నారంటూ విపక్షాలు కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాయి. ఎన్నికల షెడ్యూలు వచ్చాక కూడా వైసీపీకి అనుకూలంగా ఈ ఇద్దరు ఉన్నతాధికారులు పని చేస్తున్నారంటూ ఫిర్యాదులో పేర్కొన్నాయి. దీనిపై రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని కేంద్ర ఎన్నికల సంఘం నివేదిక కోరింది. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేష్ కుమార్ మీనా విచారణ జరిపి.. నివేదికను సీఈసీకి అందించారు. ఆ నివేదిక ప్రకారం.. ఇద్దరు సీనియర్ ఐపీఎస్ అధికారులపై ఎన్నికల సంఘం మంగళవారం బదిలీ వేటు వేసింది. తక్షణమే వీరు విధుల నుంచి తప్పుకోవాలని.. ఎన్నికలు పూర్తయ్యేవరకూ వారికి ఎన్నికలకు సంబంధించిన విధులు ఏమీ అప్పగించొద్దని ఆదేశించింది.

# గతంలోనూ ఇదే కూటమి పోటీ: సజ్జల



**అమరావతి,ఏప్రిల్24 (ప్రజా మంటలు):** గత ఎన్నికల్లో ఇదే కూటమి పోటీ చేసిందని ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి గుర్తు చేశారు. అప్పుడు ఎంత రాచి రంపాన పెట్టారో ప్రజలకు తెలియదా అని ప్రశ్నించారు. తాడేపల్లిలో ఆయన మీడియా మాట్లాడుతూ.. చంద్రబాబుకు ఎందుకు లొంగిపోయారో ఆలోచించుకోవాలని సూచించారు. చంద్రబాబు నాటకంలో పవన్‌ది చిన్న పాత్ర మాత్రమేనని సజ్జల ఎద్దేవా చేశారు. మేం అధికారంలోకి రాబోతున్నామని తెలిసే వాళ్లకు కోపం పెరుగుతుందని విమర్శించారు. కాపుల ఓట్లు గంపగుత్తగా టీడీపీకి వేయించేందుకు పవన్ కల్యాణ్ విశ్వప్రయత్నం చేస్తున్నారని సజ్జల ఆరోపించారు. చంద్రబాబుకు ఎందుకు ఓట్లు అప్పజెప్పాలని అనుకుంటున్నారని నిలదీశారు. కూటమిలో అందరూ చంద్రబాబు మనుషులే అని ఆయన స్పష్టం చేశారు.

# సర్వేపల్లి నుంచి సోమిరెడ్డి నామినేషన్

## అట్టహాసంగా కార్యక్రమం నిర్వహణ

**నెల్లూరు,ఏప్రిల్24 (ప్రజా మంటలు):** సర్వేపల్లి టీడీపీ అభ్యర్థిగా సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. సోమిరెడ్డి నామినేషన్ కార్యక్రమం అట్టహాసంగా సాగింది. కూటమి అభ్యర్థి నామినేషన్‌కు వేలాదిగా టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. దీంతో వెంకటాచలం జాతీయ రహదారి జన సందోహంగా మారింది. నామినేషన్ వేసిన అనంతరం సోమిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ... సర్వేపల్లి అభ్యర్థిగా రెండు సెట్లు నామినేషన్ దాఖలు చేసినట్లు తెలిపారు. డమ్మీ అభ్యర్థిగా తన కోడలు శృతి నామినేషన్ దాఖలు చేశారన్నారు. పిలుపు ఇవ్వకపోయిన సర్వేపల్లి ప్రజలు వేలాదిగా తరలివచ్చారని తెలిపారు. మేనిఫెస్టో ద్వారా వంద హామీలు ఇచ్చిన ప్రజలు జగన్మోహన్ రెడ్డిని నమ్మరన్నారు. మద్య నిషేధం, 45 ఏళ్లకే పింఛన్, కరెంటు చార్జీలు హామీలను విస్మరించిన జగన్ని ప్రజలు నమ్మరన్నారు. 99 శాతం హామీలు అమలు చేసాను అని జగన్ మోసం చేస్తున్నారని విమర్శించారు. రాష్టాన్ని అప్పుల, అరాచకాల రాష్ట్రంగా జగన్ మార్చారని విరుచుకుపడ్డారు. ఐదేళ్ల దోపిడీపై ప్రతిఘటనకు బహుమానంగా తనపై 18 కేసులు పెట్టారని మండిపడ్డారు. నియోజకవర్గంలో కాకాణి గోవర్ధన్ మందును ఏరులై పారిస్తున్నారన్నారు. గత ఎన్నికల్లో కల్తీ మద్యం.. ఇప్పుటి ఎన్నికలు మద్యంతో చేయాలని కాకాణఇ చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాకణి కల్తీ మద్యానికి బలి కావద్దని ప్రజలకు విన్నవించారు. సర్వేపల్లి ప్రజలు కాకాణికి ప్రతిఘటన సినిమా చూపించేందుకు సిద్ధంగా ఉన్నారు.

# మత విద్వేషాలను రెచ్చగొట్టేలా మోడీ వ్యాఖ్యలు

## అవి పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం - కరీంనగర్ ఎంపి అభ్యర్థి వినోద్ కుమార్



కరీంనగర్,ఏప్రిల్24 (ప్రజా మంటలు): ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ మత విద్వేషాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తోందని కరీంనగర్ ఎంపి అభ్యర్థి వినోద్ కుమార్ మండిపడ్డారు. మోదీ ప్రధానమంత్రిగా మత వివక్షతో కూడిన వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. మోదీ వ్యాఖ్యలు రాజ్యాంగ విరుద్ధమని మండిపడ్డారు. ఇలాంటి వ్యాఖ్యలు చేసేవారిపై అనర్హత వేటు వేయాలన్నారు. ఇందిరాగాంధీ హయాంలో కూడా 'ఇందిర అంటే ఇండియా.. ఇండియా అంటే ఇందిరా' అనుకున్నారని, అధికారం ఎప్పటికీ శాశ్వతం కాదని వ్యాఖ్యానించారు. కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో బోయినపల్లి వినోద్ కుమార్ జోరుగా ప్రచారం చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం రోజూ రెండు పూటలా ఆయన ప్రచారం కొనసాగుతోంది. బుధవారం ఉదయాన్నే వేములవాడ పట్టణంలో మార్నింగ్ వాకర్స్‌తో వినోద్ కుమార్ మాట్లాడారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో తనను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన ఓటర్లను కోరారు. కరీంనగర్ ప్రజలు గతంలో బండి సంజయ్‌కి బావోద్వేగంతో ఓట్లు వేశారని, ఐదేళ్లు ఎంపీగా ఉండి ఆయన ఐదు రూపాయలు కూడా తేలేదని వినోద్‌కుమార్ విమర్శించారు. అందుకే నియోజకవర్గ ప్రజలు ఈసారి సంజయ్‌కు ఓటు వేయొద్దని నిర్ణయించుకున్నారని చెప్పారు. గర్భిణులకు పాలు, గుడ్లు ఇస్తున్నామని బీజేపీ వాళ్లు పోస్టర్‌లు వేసుకున్నారని, ఆ పథకం జవహర్‌లాల్ నెహ్రూ అంగన్‌వాడీల ద్వారా అమలు చేసినప్పటి నుంచే ఉందని అన్నారు. వంద రోజుల ఉపాధి హామీ పనులకు నిధులు ఇస్తున్నామని చెబుతున్నారని, దాని గురించి మన చట్టంలోనే ఉందని వినోద్ కుమార్ వ్యాఖ్యానించారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి ముగ్గురు, బీజేపీ నుంచి నలుగురు ఎంపీలు గెలిచి రాష్ట్రానికి తెచ్చిందేమీ లేదని అన్నారు. తాను పార్లమెంట్ సభ్యుడిగా గెలిచి తెలంగాణ సమస్యలపై 553 సార్లు ప్రశ్నలు అడిగానని, కొత్తపల్లి- మనోహరాబాద్ రైల్వే లైన్ సిరిసిల్ల వరకు తీసుకువచ్చానని, జాతీయ రహదారులు కూడా తీసుకువచ్చా నని చెప్పారు. బండి సంజయ్ రాజన్న సిరిసిల్ల జిల్లాకు కనీసం ఒక నవోదయ పాఠశాల కూడా తేలేదని వినోద్ విమర్శించారు. తన హయాంలో కరీంనగర్‌కు రూ.1000 కోట్ల నిధులు తెచ్చినట్లు తెలిపారు. తనను పార్లమెంటుకు పంపితే తెలంగాణ ప్రజల గొంతుకై వినిపిస్తానని ఆయన చెప్పారు. గోదావరి జలాలను అచ్చంపల్లి ద్వారా తమిళనాడు తరలిస్తాం అంటున్నారని, దాంతో మనకు అన్యాయం జరుగుతుందని అన్నారు. తాను మట్టి పనికైనా మన ఊరి వాడిగా ఉంటానని అన్నారు. ప్రజలు బాగా ఆలోచించి పనిచేసే తనకు అవకాశం కల్పించాలని కోరారు.

# ఊపందుకున్న నామినేషన్ల ఘట్టం

## నేటితో ముగియనున్న గడువు

## మెదక్,జమీరాబాద్‌లలో బిఆర్ఎస్ అబ్యర్థుల నామినేషన్లు



హైదరాబాద్,ఏప్రిల్24 (ప్రజా మంటలు): ఎన్నికల నామినేషన్ల ఘట్టం గురువారంతో ముగియనుంది. దీంతో అభ్యర్థులు నామినేషన్లు వేసే పనిలో పడ్డారు. కొందరు మరోమారు సెట్లను సమర్పిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలకు నాలుగో విడత ఎన్నికల్లో భాగంగా మే నెల 13న పోలింగ్ జరగనుండటంతో.. నామినేషన్‌ల ప్రక్రియ కొనసాగుతున్నది. ఈ నెల 18 మొదలైన నామినేషన్‌లకు రేపటితో గడువు ముగియనుంది. గడువు ఒక్కరోజే ఉండటంతో పెద్ద సంఖ్యలో నామినేషన్‌లు దాఖలవుతున్నాయి. బుధవారం మెదక్ లోక్‌సభ స్థానానికి బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రాంరెడ్డి సెట్ 1 నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా వెంకట్రాంరెడ్డి వెంట సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్, బీఆర్ఎస్ నేత పుష్ప నాగేష్ యాదవ్ ఉన్నారు. జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ నామినేషన్ దాఖలు చేశారు. పార్టీ నాయకులు, అనుచరులతో కలిసి సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయానికి వెళ్లిన గాలి అనిల్ కుమార్.. ఎన్నిలక రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను సమర్పించారు.ఈ సందర్భంగా అభ్యర్థి అనిల్ కుమార్ వెంట బీఆర్ఎస్ కీలక నేత, రాష్ట్ర మాజీ మంత్రి హరీశ్‌రావు, జిల్లా పరిషత్ చైర్మన్ మంజుశ్రీ రెడ్డి ఉన్నారు. తెలంగాణలోని 17 లోక్‌సభ స్థానాలకు నాలుగో విడత ఎన్నికల్లో భాగంగా మే 13న పోలింగ్ జరగనుంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ మెదక్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి మాజీ కలెక్టర్, వెంకట్రామ్ రెడ్డి బుధవారం ఉదయం నంగునూర్ మండలం, కొనాయి పల్లి వెంకటేశ్వరా స్వామి దేవాలయంలో స్వామి పాదాల వద్ద నామినేషన్ పత్రాలు పెట్టీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నామినేషన్ పత్రాలను కొనాయిపల్లి ఆలయంలో పెట్టీ ప్రత్యేక పూజలు చేశామని, ప్రజల ఆశీర్వాదంతో గెలుపొందుతామని ఆశాభావం వ్యక్తం చేశారు. మెదక్ ప్రజల కుటుంబ సభ్యుడిగా ఉంటానని, ప్రజల సేవకు అంకితం అవుతానని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో తాను ఇచ్చిన హామీలు అమలు చేస్తానని, వెంకటేశ్వర స్వామి ఆశీర్వాదం తీసుకున్న దేవుడిపై సాక్షిగా ప్రమాణం చేసి చెబుతున్న.. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటానని వెంకట్రామ్ రెడ్డి స్పష్టం చేశారు. రూ. 100 కోట్లతో ఫంక్షన్ హాల్, పేదలకు విద్య అందిస్తామన్నారు. మెదక్ పార్లమెంటు అభ్యర్థిగా ఘనవిజయం సాధిస్తానని వెంకట్రామ్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత కలెక్టర్‌గా పనిచేసే అవకాశం తనకు రావడం అదృష్టమని వెంకట్రామ్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకే తాను మెదక్ ఎంపీగా పోటీ చేస్తున్నానన్నారు. కలెక్టర్‌గా మెదక్ ఉమ్మడి ప్రాంత అభివృద్ధికి ఎనలేని కృషి చేశానని, ఇకపై రాజకీయాల్లోనూ పేదలకు సేవ చేస్తానని వెంకట్రామ్ రెడ్డి ప్రకటించారు.

# మే 24 నుండి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

## ఏప్రిల్ 25 నుంచి మే 2వ తేదీ వరకు ఫీజు చెల్లింపు

హైదరాబాద్,ఏప్రిల్24 (ప్రజా మంటలు): తెలంగాణలో మే 24 నుండి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జూన్ ఒకటో తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. ఈ మేరకు ఇంటర్ బోర్డు షెడ్యూల్ రిలీజ్ చేసింది. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు ఫస్ట్ ఇయర్ పరీక్షలు.. మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు సెంకడియర్ పరీక్షలు జరగనున్నాయి. సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన పరీక్ష ఫీజును ఏప్రిల్ 25 నుంచి మే 2వ తేదీ వరకు ఆయా కాలేజీల్లో స్వీకరించనున్నారు. రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు సంబంధించి కూడా ఇదే సమయంలో ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. రీకౌంటింగ్ కోసం ఒక్కో పేపర్‌కు రూ. 100, రీకౌంటింగ్‌కు ఒక్కో పేపర్‌కు రూ. 600 చెల్లించాల్సి ఉంటుంది. ఏప్రిల్ 24వ తేదీ ఉదయం ఇంటర్ ఫస్ట్, సెంకడియర్ ఫలితాలను అధికారులు విడుదల చేశారు. ఈ ఏడాది 9.80 లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాయగా ఫస్టియర్ లో 60.01 శాతం, సెకండియర్ 64.19 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. రంగారెడ్డి జిల్లా టాప్ లో నిలిచింది. 2023 ఫలితాలతో పోల్చితే ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం స్వల్పంగా తగ్గింది.



# రేవంత్ సవాల్‌ను స్వీకరిస్తా

## హామీలు అమలు చేస్తే ఎమ్మెల్యేగా రాజీనామా


## మళ్లీ ఎన్నికల్లో పోటీ కూడా చేయను

## సిద్దిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు వెల్లడి

సంగారెడ్డి,ఏప్రిల్24 (ప్రజా మంటలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్‌ను స్వీకరిస్తున్నానని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిది తొండి రాజకీయమని.. ఆయన ఇచ్చిన సవాలును తాను స్వీకరిస్తున్నానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బుధవారం హరీష్ రావు సంగారెడ్డిలో మీడియాతో మాట్లాడుతూ.. ఆగస్టు 15వ తేదీ లోపు ఏకకాలంలో రైతు ఋుణమాఫీ చేసి, ఆరు గ్యారెంటీలు అమలు చేస్తే తాను తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని.. మళ్ళీ ఎన్నికల్లో పోటీ చేయనని.. తనకు పదవులు ముఖ్యం కాదని అన్నారు. రైతు రుణమాఫీ, ఇచ్చిన హామీలు చేయకపోతే రేవంత్ రెడ్డి సీఎం పదవికి రాజీనామా చేస్తారా..? అని ప్రశ్నించారు. ఈ విషయాలపై తాను శుక్రవారం (ఎల్లుండి) అసెంబ్లీ ముందు ఉన్న అమరుల స్థూపం వద్దకు చర్చకు వస్తానని.. సీఎం రేవంత్ కూడా రావాలని హరీష్ రావు అన్నారు. కాగా రైతు రుణమాఫీపై బీఆర్ఎస్ నేతలు విసురుతున్న సవాళ్లకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూటిగా స్పందించారు. ఆగస్టు 15వ తేదీలోపు రుణమాఫీ చేసి హామీని నిలబెట్టుకుంటానని, మీరు బీఆర్ఎస్ పార్టీని రద్దు చేస్తారా? అని ప్రతి సవాల్ విసిరారు. రైతు రుణమాఫీ చేయకపోతే సీఎం పదవికి రాజీనామా చేయాలని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తనకు సవాల్ విసిరారని, అటు సూర్యుడు ఇటు పొడిచినా రుణమాఫీ చేస్తానని స్పష్టం చేశారు. లంబాడ గిరిజనుల ఆరాధ్య దైవాలైన బావోజీ, సేవాలాల్‌ల సాక్షిగా ఆగస్టు 15లోగా అది జరుగుతుందని పునరుద్ఘాటించారు. తాను మాట ఇస్తే ఎలా ఉంటుందో హరీశ్‌రావు తన మామ కేసీఆర్‌ను అడిగి తెలుసుకోవాలన్నారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ తాను రుణమాఫీ చేస్తే.. బీఆర్ఎస్ పార్టీని రద్దు చేస్తారా? అని హరీశ్‌కు సీఎం ప్రతి సవాల్ విసిరారు.మంగళవారం నారాయణపేట జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని మద్దూరు మండలంలో నిర్వహించిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని దెబ్బతీసేందుకు బీజేపీ, బీఆర్ఎస్ కలిసి కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. తాము వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలకుగాను ఐదు గ్యారెంటీలు అమలు చేస్తున్నామని, కేసీఆర్ పదేళ్లలో ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఇంటికో ఉద్యోగం, కేజీ టు పీజీ విద్య, దళితులకు మూడెకరాల భూమి.. ఇలా ఏ హామీనీ కేసీఆర్ అమలు చేయలేదన్నారు. రెండుసార్లు చేసిన రుణ మాఫీ మిత్తికే సరిపోయిందని ఎద్దేవా చేశారు. పదేళ్లు ఏ హామీ అమలు చేయని కేసీఆర్‌కు ఈ ఎన్నికల్లో కోదండం వేయాల్సిన అవసరం ఉందన్నారు. తాగుబోతు అప్పుల సంసారంలాగా రూ.3,900 కోట్ల లోటు బ్జడెట్‌ను తనకు సీఎంగా బాధ్యతలు చేపట్టినప్పుడు అప్పగించారని, బాధ్యతగా వ్యవహరిస్తూ నాలుగు నెలల్లో రూ. 26 వేల కోట్ల కిస్తీలు, మిత్తి చెల్లించానని రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా ప్రతీ నెల మొదటి తేదీన ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నామని చెప్పారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించి రూ.1369 కోట్లు ఆర్టీసీకి చెల్లించామని వివరించారు. రూ.500లకు సిలిండర్ పథకం కింద రాష్ట్రంలో 40 లక్షల మంది మహిళలకు లబ్ది చేకూరుస్తున్నామని, 200 యూనిట్లలోపు ఉచిత కరెంటు పథకం కింద 44 లక్షల ఇళ్లలో వెలుగులు నింపుతున్నామని సీఎం తెలిపారు. గత ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయకపోతే తమ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రూ. 22,500 కోట్లు కేటాయించి 4.50 లక్షల ఇళ్లు మంజూరు చేశామని చెప్పారు.

రైతుల రుణాల వసూళ్ల కోసం డీసీసీబీ తదితర బ్యాంకులు రైతులపై ఒత్తిడి తెస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఏ అధికారి ఒత్తిడి చేసినా ప్రభుత్వం సీరియస్‌గా పరిగణిస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. ఆగస్టు 15వ తేదీలోపు రైతులు బ్యాంకుల నుంచి తీసుకున్న అసలు, మిత్తి నయా పైసలతో సహా చెల్లించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. రైతుల నుంచి చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రూ.500 బోనస్‌గా ఇచ్చి మరీ ప్రతీ గింజను కొంటామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

# పొరపాటున గన్ పేలి డిఎస్పీ మృతి



భద్రాచలం,ఏప్రిల్24 (ప్రజా మంటలు): ప్రమాదవశాత్తు తుపాకీ పేలడంతో సీఆర్‌పీఎఫ్ డీఎస్పీ మృతిచెందారు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పూసుగుప్ప 81వ బెటాలియన్‌లో చోటు చేసుకుంది. డీఎస్పీ శేషగిరిరావు కిందపడటంతో గన్ పేలింది. దీంతో ఆయనకు తీవ్రగాయాలయ్యాయి. బెటాలియన్ సిబ్బంది స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ డీఎస్పీ మృతిచెందారు.

# వలసపక్షులను నమ్ముకుంటే మోసమే

## మల్కాజిగిరికి రేవంత్ చేసింది సున్నా - మల్కాజిగిరి ప్రచారంలో కెటిఆర్




మేడ్చల్ మల్కాజ్‌గిరి,ఏప్రిల్24 (ప్రజా మంటలు): మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గంలో వలస పక్షులకు ఓట్లు వేస్తే గెలిచిన తర్వాత మీకు కనబడరని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. కాబట్టి జాగ్రత్తగా ఆలోచించి ఓటు వేయాలన్నారు. మల్కాజ్‌గిరి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి నామినేషన్ కార్యక్రమం సందర్భంగా కేటీఆర్ రోడ్ షోలో పాల్గొని ప్రసంగించారు. గత ఎన్నికల్లో మల్కాజ్‌గిరిలో రేవంత్ రెడ్డి స్వల్ప మెజార్టీతో గెలిచారని కేటీఆర్ గుర్తు చేశారు. రేవంత్ రెడ్డికి మల్కాజ్‌గిరి ఎంతో ఇచ్చింది. పీసీసీ, సీఎం పదవులు రావటానికి మల్కాజ్‌గిరి ప్రజలే కారణం. అలాంటి రేవంత్ రెడ్డి ఇక్కడి ప్రజలకు ఏం చేయలేదు. పార్లమెంట్‌లో పత్తా లేకుండా పోయిండు. ప్రజలకు కష్టం వస్తే కనబడకుండా పోయిండు. ఈ వలస పక్షులకు ఓట్లు వేస్తే గెలిచిన తర్వాత మీకు కనబడరు. మీకు 24 గంటలు అందుబాటులో ఉండే రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించండి అని ప్రజలను కేటీఆర్ కోరారు. పదేళ్ల అభివృద్ధి కేసీఆర్ పాలన.. వంద రోజులు అబద్ధం రేవంత్ రెడ్డి పాలన అని కేటీఆర్ పేర్కొన్నారు. బడే భాయ్ మోదీ మనకు బడా మోసం చేసిండు. చోట భాయ్ రేవంత్ రెడ్డి మనల్ని ఇక్కడ మోసం చేసిండు. వంద రోజుల్లో అందరికీ అన్ని చేస్తా అంటూ చోటా భాయ్ మోసం చేసిండు. గద్దెనెక్కిన వెంబడే రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తా అన్నాడు. రుణమాఫీ అయ్యిందా? తులం బంగారం వచ్చిందా? మహిళలకు రూ. 2500 వచ్చినయా? పైన పెద్ద మోసగాడు కింద చిన్న మోసగాడు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డి మోసం పార్ట్ -1 అనే సినిమా చూపించిండు. ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికలకు మోసం పార్ట్ -2 సినిమా చూపిస్తున్నాడు. ఎక్కడ పోతే అక్కడ దేవుళ్ల మీద ఒట్టు వేసి రుణమాఫీ చేస్తా అంటున్నాడు. ఒక్కసారి మోసపోతే మోసం చేసిన వాడి తప్పు. రెండో సారి మోసం పోతే మోసపోయిన వారిదే తప్పు. ఇప్పుడు ప్రజలంతా కేసీఆర్‌ను గుర్తు చేసుకుంటున్నారు అని కేటీఆర్ తెలిపారు.

# కెసిఆర్ కాన్వాయ్‌లో ప్రమాదం

## ఒకదానిని మరోటి ఢీకొన్న వాహనాలు

## ఎలాంటి ప్రమాదం జరగలేదని సమాచారం

## బస్సును ఆపి కెసిఆర్‌ను కలిసిన రైతులు



హైదరాబాద్, ఏప్రిల్24 (ప్రజా మంటలు): బిఆర్ఎస్ అధినేత, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కాన్వాయ్‌లో ప్రమాదం జరిగింది. ఆయన వాహన శ్రేణిలోని కార్లు ఒకదానిని మరొకటి ఢీకొన్నాయి. ఇలా మొత్తం 8 కార్లకు ప్రమాదం జరిగింది. నల్గొండ జిల్లా వేములపల్లి వద్ద ఈ ప్రమాదం జరిగింది. కాన్వాయ్ లో ఉన్న వారికి ముప్పు తప్పినట్లుగా తెలిసింది. ఈ 8 వాహనాలు స్వల్పంగా దెబ్బతిన్నట్లుగా తెలుస్తోంది. ముందు వెళ్తున్న కారు డ్రైవర్ సడెన్ బ్రేక్ వేయడమే ప్రమాదానికి కారణమని అంటున్నారు. బస్సు యాత్ర, రోడ్ షోల ద్వారా లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో మాజీ సీఎం కేసీఆర్ దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. తొలిరోజైన నేడు మిర్యాలగూడ నుంచి ప్రారంభమైన కేసీఆర్ బస్సు యాత్ర వచ్చే నెల పదో తేదీన సిద్దిపేట బహిరంగ సభతో ముగుస్తుంది. నల్గొండ జిల్లాలో కేసీఆర్ బస్సు యాత్ర కొనసాగుతుండగా.. ఆయన బస్సును ఆపి నల్గొండ మండలం ఆర్జాలబాయి రైతన్నలు తమ గోడు వినిపించారు. ఐకేపీ సెంటర్ నుంచి గన్నీ బ్యాగుల ప్రదర్శన చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. 20 రోజుల నుంచి కల్లాల్లో వడ్లు పోసుకొని కూర్చున్నామని ధాన్యం ఎవరూ కొనడం లేదని ఆవేదన చెందారు. కరెంటు లేదని రైతు బతుకు అంతా ఆగమైందని కేసీఆర్ కు ఫిర్యాదు చేశారు. మీరున్నప్పుడు ఎండాకాలం కుడా నీళ్లు మత్తళ్లు దుంకేవి.. మీరు ఉన్నప్పుడే మంచిగుండే సార్.. మల్లా మీ పాలనే రావాలని నినాదాలు చేశారు. రైతు బంధు లేదు.. 500 బోనస్ అన్నరు అది బోగస్ అయింది.. మేం పండించి కల్లంల పోసిన ధాన్యాన్ని కొంటలేరు. ఇగ బోనస్ ఏమిస్తారు సార్. కాంగ్రెస్ పాలన అంత బోగస్ పాలన అయ్యిందని రైతన్నలు గోడు వెళ్లబోసు కున్నారు. పోరాడి సాధించుకుందాం నీళ్లు, కరెంటు మళ్లా తెచ్చుకుందాం పోరాటానికి సిద్ధంగా ఉండండి అని కేసీఆర్ పిలుపు ఇచ్చారు. అంతకుముందు అన్నెపర్తి దగ్గర కూడా కేసీఆర్ ను ఆపి ఇదే తరహాలో రైతన్నలు తమ గోడు వెల్లబోసుకున్నారు.



# ఇంటర్‌లో ఫెయిల్ ఇద్దరు అమ్మాయిల బలవన్మరణం

హైదరాబాద్,ఏప్రిల్24 (ప్రజా మంటలు): తెలంగాణలో ఇంటర్ ఫస్ట్, సెకండియర్ పరీక్షల ఫలితాలు వెలువడ్డాయి. అయితే కొంతమంది విద్యార్థులు పరీక్షలో ఉత్తీర్ణత సాధించలేదని మనస్తాపానికి గురై బలవన్మరణానికి పాల్పడుతున్నారు. తాజాగా ఇంటర్ ఫెయిల్ అయినందుకు ఇద్దరు అమ్మాయిలు తనువు చాలించారు. మెదక్ జిల్లా శేరిపల్లిలో ఇంటర్ సెకండియర్ బాలిక పంబాల రమ్య ఉత్తీర్ణత సాధించలేదు. మనస్తాపానికి గురైన ఆమె.. గ్రామ శివారులో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. ఖమ్మం జిల్లా ముదిగొండలో వాకదాని వైశాలి (17) ఇంటర్ ఫస్ట్ ఈయర్ చదువుతుంది. ఫలితాల్లో ఒక సబ్జెక్టు ఫెయిల్ కావడంతో మనస్తాపానికి గురై.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్ కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఫెయిలైతే సప్లిమెంటరీలో పాస్ కావొచ్చు కానీ జీవితం తిరిగి రాదంటూ లెక్చరర్లు చెబుతున్నారు.

EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com